నవతెలంగాణ

1

మెదక్

శుక్రవారం | 29 మార్చి 2024 | www.navatelangana.com

ఇఫ్తార్ విందుకు హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ



నవతెలంగాణ-జోగిపేట

రంజాన్ పండుగను పురస్కరించుకొని జోగిపేట మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో గల ఖదీం జాన్మియ మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఉపవాస దీక్షలు చేపట్టిన మైనార్టీ సోదరులకు మంత్రి చేతుల మీదుగా ఉపవాస దీక్షలను విరమింప చేశారు. ముస్లింలకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మైనార్టీలు మంత్రి దామోదర్ రాజనర్సింహను సన్మానించారు. పండగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేష్ షెట్కర్, జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్లు యస్. సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, డాకురి శంకర్, రంగ సురేష్, కోరబోయిన నాగరాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివరాజ్, మాజీ ఎంపిటిసి డిజి. వెంకటేశం, మాజీ వార్డు మెంబర్ పట్బోళ్ల ప్రవీణ్, మైనార్టీ నాయకులు గోహెర్ అలీ, అలీ అబ్బాస్, చోటు ఖాన్, కాలేద్, ఇమ్రాన్, అక్రమ్, సోహెల్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు చిట్యాల మధు, ఉలువల సతీష్, హనుమాన్లు, రాజశేఖర్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీలం మధును సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గురువారం నర్సాపూర్ వచ్చిన సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి , కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమన్న గారి రవీందర్ రెడ్డి లు నీలం మధుకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా మల్లేశం అశోక్ గౌడ్ మణిదీప్ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ టు పార్లమెంట్‌కు...

నీలం మధు



- కలిసొచ్చిన బీసీ వాదం...సేవా దృక్పథం
- వార్డు మెంబర్‌గా రాజకీయ ప్రస్తానం షురూ
- చిట్కూల్ ఉప సర్పంచ్, సర్పంచ్ ఎన్నిక
- నీలం మధు యువసేన పేరిట సేవా కార్యక్రమాలు
- ఉద్దండుల్ని కాదని మధుకు ఎంపీ టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం
- ప్రజలే బలం...ప్రగతే లక్ష్యంగా నీలం మధు పయణం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పంచాయతీ మెంబర్‌గా మొదలైన నీలం మధు రాజకీయ ప్రస్తానం పార్లమెంట్ మెంబర్‌గా పోటీ చేసే స్థాయికి చేరింది. "కథ ముగిసింది అనుకున్న ప్రతిసారీ మొదలవుతూనే ఉంది మళ్లీ కొత్త యుద్ధం" అన్నట్టుగా నీలం మధు రాజకీయంగా అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. నమ్ముకున్న బీసీ వాదం...సేవా దృక్పథం ఆయన్ను రాజకీయాల్లో ఉన్నత స్థాయికి చేరుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో ఉద్దండులైన నాయకుల్ని పక్కనబెట్టి నీలం మధును మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడం విశేషం. తనకు గొప్ప జీవితం లేకపోయినా జీవితంలో తన పాత్ర ఎప్పుడూ గొప్పగానే ఉండాలని విశ్వసించే నీలం మధు ఆశయం వెనకాల ఓ పెద్ద సైన్యమే ఉంది. ప్రజలే బలం. ..బలగంగా ముందుకు సాగుతున్న నీలం మధుకు కాంగ్రెస్ క్యాడర్ తోడైంది.

పంచాయతీ మెంబర్‌గా ప్రస్తానం

పటాన్‌చెరు మండలం చిట్కూల్ గ్రామానికి చెందిన నీలం మధు అతిచిన్న వయసులోనే పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మధు ఉన్నత చదువులు చదవకపోయినా ప్రజల కోసం పనిచేయాలన్న ఉన్నత లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చారు. 2008లో చిట్కూల్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2014లో ఉపసర్పంచ్‌గా పనిచేశారు. ప్రాదేశిక ఎన్నికల్లో జెడ్పీటీసీగా టీఆర్ఎస్ నుంచి పోటీ చేశారు. ఆ తర్వాత 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. చిట్కుల్ గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించారు. అదే విధంగా పలు సేవా సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రజల ఆదరణ పొందారు. నీలం మధు యువసేన ఏర్పాటు చేసి ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా జాతీయ స్థాయిలో ఉత్తమ సేవా అవార్డులు పొందిన నీలం మధు రాజకీయాల్లోనూ ఎదుగుతూ వచ్చారు.

నమ్ముకున్న బీసీ వాదమే కలిసొచ్చింది

ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధుకు బీసీ వాదం కలిసొచ్చింది. ముందు నుంచీ మధు ముదిరాజ్‌ల కోసం పని చేశారు. అదే క్రమంలో అన్ని సామాజిక వర్గాలను ఆదుకుంటూ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా తెలంగాణలో 65 లక్షల మంది ముదిరాజ్‌లున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముదిరాజ్ సామాజిక వర్గం బలంగా ఉంది. బీసీ నాయకుడుగా ఎదిగిన మధుకు పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ ఓట్లు కలిసొస్తయని బావించి కాంగ్రెస్ అధిష్టానం మెదక్ ఎంపీ టికెట్ ఇచ్చింది. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో కనీసం 4 చోట్లైనా బీసీలకు కేటాయించాలని బావించిన కాంగ్రెస్ జహీరాబాద్, మెదక్ రెండు సీట్లు కూడా బీసీలకే కేటాయించింది. నీలం మధుతో పాటు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, రవింద్రనాథ్ టికెట్ కోసం పోటీ పడినా కాంగ్రెస్ అధిష్టానం మాత్రం బీసీ వర్గానికి చెందిన నీలం మధు వైపే నిలిచింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర అండ కూడా కలిసొచ్చింది.

రాజకీయంగా ముందడుగు

వార్డు మెంబర్‌గా ఉప సర్పంచ్‌గా సర్పంచ్‌గా పనిచేసిన నీలం మధు పటాన్‌చెరు ఎమ్మెల్యేగా గెల్వాలనుకున్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ అడిగారు. మొదట్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అనుచరుడుగా ఉన్న మధు ఆ మధ్య స్వతంత్రంగా ఎదుగుతూ వచ్చారు. కేటీఆర్, హరీశ్‌రావు, కవితతో సన్నిహితంగా ఉంటూ టికెట్ కోసం ప్రయత్నించారు. బీఆర్ఎస్ టికెట్ రాకపోయే సరికి కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీలోనూ టికెట్ దక్కలేదు. దీంతో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి 40 వేలకు పైగా ఓట్లు సాధించి రాష్ట్రంలోనే చర్చనీయాంశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తిరిగి ఆ పార్టీలో చేరిన మధు మెదక్ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించారు. స్థానికంగా కాట శ్రీనివాస్‌తో పొసగప్పటికీ మంత్రి దామోదర రాజనర్సింహ మద్దతు కూడగట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి అండతో బలమైన నాయకుల్ని కాదని ఎంపీ టికెట్ తెచ్చుకోగలిగారు.

73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో కనీస వేతనాల జీఓలను

- పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలి
- సిఐటీయు రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కు వినతి



నవతెలంగాణ-సంగారెడ్డి

73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో కనీస వేతనాల జీఓలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న సుమారు 1.20 కోట్ల మంది కార్మికుల కనీస వేతనాల సవరణ అతి తక్కువగా చేసింది ఆయన మండిపడ్డారు. తక్కువ వేతనాలు నిర్ణయించి కార్మికుల కడుపులు కొట్టే చర్యకు ప్రభుత్వం పూనుకున్నది అని అన్నారు. 15 సంవత్సరాల తరువాత సవరించిన వేతనాలలో ఎలాంటి పెరుగుదల లేదు అని అన్నారు. 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం కనీస వేతనాలను 1957లో 15వ ఐఎల్సి తీర్మానం ప్రకారంగా ఆక్రాయిడ్ ఫార్ములా ఆధారంగా లెక్కించి నిర్ణయించాలి అని అన్నారు. 1992లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిటైర్మెంట్ తరువాత జీవితానికి లెక్కించి పెరిగిన ప్రకారం రూ.26,000/- లు నిర్ణయించాలి అని అన్నారు. కానీ గత ప్రభుత్వంలో నిర్ణయించిన రూ.18,000/-లను తగ్గించి, వివిధ రంగాల్లో రూ.11,325/-లు నిర్ణయించడం అన్యాయం అన్నారు. ఈ కనీస వేతనాల నిర్ణయాన్ని పున్ణ సమీక్షించి పెరిగిన ధరల ప్రకారం ఇవ్వాలని అన్నారు.1948 కనీస వేతనాల చట్టం ప్రకారం రాష్ట్రంలో ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి వేతనాలు సవరించబడాలి అని అన్నారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో 2006-12 మధ్య వేతనాలు సవరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పారిశ్రామికవేత్తల లాభాల కోసం కార్మికుల వేతనాలు సవరించలేదు అని మండిపడ్డారు. 15 సంవత్సరాలుగా కార్మికులకు గత ప్రభుత్వం అన్యాయం చేసింది అని అన్నారు. గతంలో కనీస వేతనాల సలహా మండలిలో 2015-16లో తీర్మానం చేసి ఆనాటి ధరల ప్రకారం కనీస బేసిక్ రూ.12,000/-లు నిర్ణయించారు. 2017 తరువాత రూ.18,000/-లు నిర్ణయించి 2021లో 5 రంగాలకు ఫైనల్ నోటిఫికేషన్స్ ఇచ్చింది అని గుర్తు చేశారు. యాజమాన్య సంఘాలు గెజిట్ కాకుండా అడ్డుకున్నాయి కొత్తగా జారీచేసిన కనీస వేతనాలను పరిశీలిస్తే 'కొత్త సీసాలో పాత సారా' మాదిరిగా ఉంది అని అన్నారు. 15సంవత్సరాల క్రితం బేసిక్ కు 1768 డిఎ పాయింట్లకు ఆయా షెడ్యూల్డ్ ఎంప్లాయిస్ జీఓలకు వర్తించే రేట్ల ప్రకారం కొత్త బేసిక్ నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరించకపోయినా ప్రస్తుతం పొందే వేతనానికి కొత్త డిఎ పాయింట్లు కలిపితే అంతే వేతనం పొందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారులను సంతృప్తిపర్చే విధంగా తన వర్గ స్వభావాన్ని చాటుకుంది అని అన్నారు. కార్మిక సమస్యల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాట నిర్వహిస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరి ప్రవీణ్ మల్లేశం రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు
- సీఐటియు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా



నవతెలంగాణ - పటాన్ చెరు

పటాన్ చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్కర్లకు 4నెలలగా వేతనాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో 40మంది కార్మికులు గత 12 సంవత్సరాలుగా పని చేస్తున్నారని,వీరంతా ఆసుపత్రిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ,సెక్యూరిటీ,ఆపరేషన్ థియేటర్ పనులు,అంబులెన్స్ డ్రైవర్ ఇతర పనులు చేస్తున్నారని గుర్తు చేశారు .వీరికి కేవలం 12 వేల రూపాయల వేతనం ఇస్తున్నారని,.జి వో ప్రకారం 15600 రూపాయల వేతనం ఇవ్వాల్సి ఉండగా కాంట్రాక్టర్ బెదిరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.వచ్చే వేతనం కూడా ప్రతి నెల చెల్లించడం లేదని అన్నారు.డిసెంబర్, జనవరి,ఫిబ్రవరి,నెలల పెండింగ్ జీతాలు,మార్చి నెల చివరికి వచ్చిందని అన్నారు.4నెలల జీతాలు పెండింగ్ లో వుంటే ఏ విధంగా కార్మికులు జీవనం కొనసాగిస్తారని అన్నారు.కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు.అనంతరం అర్ ఎం గారికి మెమొరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీరేశ్,గోపాల్,నగేష్,రాంబాయి,రేణుక,సోమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు ,బిక్షపతి ఇతరులు పాల్గొన్నారు.

మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తా

- సీఎం రేవంత్, మంత్రి దామోదరను కలిసిన నీలం మధు



నవతెలంగాణ-పటాన్ చెరు

తనపై నమ్మకంతో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నీలం మధు ముదిరాజ్ పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి దామోదర రాజనర్సింహ, మైనంపల్లి హనుమంతరావుతో పాటు ఇతర నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అందరి సహకారంతో మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ లాంటి మహానేత ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంటు స్థానానికి తనను ఎంపిక చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరాగాంధీ హయాంలోనే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్లి కాంగ్రెస్ పార్టీ గెలుపొందేలా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డి, మైనంపల్లి హనుమంత్ రావు ఆశిస్సులతో పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జిలు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలుపు కొని కాంగ్రెస్ శ్రేణుల సహకారంతో మెదక్ సీటును కాంగ్రెస్ ఖాతాలో వేస్తామని స్పష్టం చేశారు.

ఢీ అంటే ఢీ..

- బెదిరింపులకు భయపడేది లేదు.. కోడ్ తర్వాత ఊరుకునేది లేదు
- ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?
- ఓట్లేసిన ప్రజలకు అభివృద్ధి చేసి చూపండి
- ప్రతీ కార్యకర్తలు అండగా ఉంటాం
- బీఆర్ఎస్ జిల్ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-మెదక్

రాజకీయ వేదికగా ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల పై దాడులకు, బెదిరింపులకు పాల్పడుతామంటే భయపడేది లేదని, ఎన్నికల కోడ్ తరువాత ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ జిల్ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన చేయాలి కానీ ప్రతిపక్ష కార్యకర్తల మీద దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారాన్నరు. మెదక్ పట్టణంలో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో చేసిన రాజకీయ విమర్శలను తట్టుకోలేక ఐదో వార్డు కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు ఇంటి పై కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించడం హేయమైన చర్య అని తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా పాలన కొనసాగాలి కానీ ఎమ్మెల్యే అనుచరులు ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి దాడికి యత్నించి, ధర్నా చేయడం బాధాకరమైన విషయమన్నారు. రాజకీయంలో విమర్శలు ప్రతి విమర్శలు ఉండాలి కానీ ఇళ్ళ పైకి దాడులకు పాల్పడటం సరికాదన్నారు. సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయని, మంచి నీళ్ళకు ఇబ్బంది అవుతూ ఆడ బిడ్డలు గోస పడుతున్నారని, రుణమాఫీ చేయలేదనేటువంటి అంశాల పై దృష్టి సారించకుండా, ప్రతిపక్ష పార్టీలు వాటి పై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని మండిపడ్డారు. ప్రజలు గెలిపించింది దాడులు చేసేందుకేనా అంటూ అసహనం వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన నాయకులకు సంస్కారం, విజ్ఞత ఉండాలని, ఏదైనా ఉంటే చట్టం, న్యాయ పరంగా వెళ్ళాలని, వేదిక ద్వారా మాట్లాడాలని హితవుపలికారు. తెలంగాణ కోసం 14 ఏళ్ల ప్రశ్నించే గొంతుకగా ప్రజల పక్షాన నిలిచి ఉద్యమం చేశామని, బెదిరింపులకు ఎప్పుడూ భయపడలేదన్నారు. పదిహేను ఏళ్ళు ఒక పార్టీలో పనిచేసినా ఇబ్బందిగా ఉన్నప్పుడు ఎవరైనా పార్టీ మారుతారని అలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన ఆంజనేయులు పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా చేసి, మరోమారు టిక్కెట్ ఇచ్చిన బీఆర్ఎస్ ను వదిలి మైనంపల్లి పార్టీ మారొచ్చా అని ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ లో ఎమ్మెల్యే ఒక కౌన్సిలర్ ను కించపర్చి మాట్లాడటం సరికాదన్నారు ఆవేదన వ్యక్తం చేస్తే దాడులు చేస్తాం అంటే అందరి పైన కేసులు పెట్టండని తెలిపారు. మెదక్ లో ఇలాంటి పరిణామాలతో ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారో చెప్పాలన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, అది చేయండని సూచించారు. పంట పరిహారం, బోనస్, పింఛన్లు, మహాలక్ష్మి స్కీం, కళ్యాణ లక్ష్మి తులం బంగారం, మెరుగైన వైద్యం అంటూ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలన్నారు. పోలీసులతో అక్రమ కేసులు పెడుతున్నారని, అన్నింటిని ఎదుర్కొంటామన్నారు. స్థానిక ఎమ్మెల్యే దాడులు మానుకొని ఓట్లేసిన ప్రజలు అందుబాటులో ఉండి అవసరాలను తీర్చాలని కోరారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్ మాట్లాడుతూ.. కౌన్సిలర్ ఆంజనేయులు పై కాంగ్రెస్ నేతల దాడిని ఖండిస్తున్నామన్నారు.తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరని, 100 రోజుల అవకాశంలో ఏమి చేశారో చెప్పాలన్నారు. ప్రతిపక్ష పాత్ర ఇంకా స్టార్ట్ కాలేదని, రేపటి రోజుల ప్రజలు ప్రశ్నిస్తే వాళ్ళ ఇంటి ముందు ధర్నా చేస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రభుత్వం పూర్తి స్థాయిలో సేవా చేయడం లేదన్నారు. ఎన్నికల కోడ్ ఉందని, జూన్ 4 తరువాత తాము డీ అంటే ఢీ అనే విధంగా సమాధానం ఇస్తామన్నారు. ప్రజలకు ఏం చేస్తున్నారో చెప్పుకోవాలని, బెదిరిస్తే తిరుబాటు తప్పదని హెచ్చరించారు. రాజకీయంలో విమర్శలు సహజమని, రేవంత్ రెడ్డి కూడా చాలా సార్లు తిట్టారని అతడి పైన కేసులు పెట్టాలా అని ప్రశ్నించారు. ఇలానే చేస్తే కాలమే బుద్ధి చెప్పుతదని, ప్రతీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కౌన్సిలర్ దాడిని నిరసిస్తూ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎన్నికల కమిషన్ కు పిర్యాదు చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్ కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు మామిండ్ల ఆంజనేయులు, కిషోర్, శ్రీనివాస్, చిన్నశంకరంపేట జడ్పీటీసీ మాధవి రాజు, మండల పార్టీ అధ్యక్షులు రాజు, నాయకులు లింగారెడ్డి, రాగి అశోక్, శ్యామ్ సుందర్, లింగం, సతీష్ రావు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కుమార్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, సాప సాయిలు, యాదగిరి, ప్రభాకర్, సాయ గౌడ్, రాజేశ్వర్ రావు, సుధాకర్, అహ్మద్ కిషన్, బాలరాజు, రమేష్, హేమ చంద్రం, వెంకట్, దశరథ్, నరేష్, నాగరాజు, నవీన్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికులకు 5నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు అతిమేల మానిక్
- ఖేడ్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ముందు కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గత 5నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటలక్ష్మి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా అతిమేల మానిక్ మాట్లాడుతూ గత ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కుటుంబాలు గడువని పరిస్థితి నెలకొన్నదని, పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇతర పర్మనెంట్ ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెల రెగ్యులర్ గా జీతాలు చెల్లించాలని అన్నారు పెరిగిన ధరలతో వస్తున్న జీతాలు ఏమాత్రం సరిపోక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు కనీస వేతన అమలు చేయాలని అన్నారు.. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26000/- పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సతీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్ హాస్పిటల్ యూనియన్ నాయకులు అడివమ్మ, రేవతి, లక్ష్మి, బాలమణి, ఎలీషా, బాలనాగమ్మ, విక్టోరియా, కవిత, బాలన్న, సత్యనారాయణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. ఖేడ్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికుల(సిఐటియు) యూనియన్ కమిటీ ఏర్పాటు యూనియన్ ఎన్నిక గౌరవ అధ్యక్షులు: అతిమేల మానిక్ అధ్యక్షులు: కిందిదోడ్డి సతీష్, ఉపాధ్యక్షులు: అడివమ్మ, బాలమణ్ణి, ప్రధాన కార్యదర్శి: రేవతి. సహాయ కార్యదర్శులు: లక్ష్మి, విక్టోరియా, కమిటీ సభ్యులు: అర్జున్,బాలన్న,కవిత, ఎలిషా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మనవడి పెళ్లి ఆగిపోవడంతో తాత ఆత్మహత్య

- పెళ్లికూతురును తీసుకురావడానికి వెళ్లి ముగ్గురి దుర్మరణం



నవతెలంగాణ-పాపన్నపేట

పెళ్లికూతురుని తీసుకురావడానికి వెళ్లి ట్రాక్టర్ ప్రమాదంలో ముగ్గురు బందువులు మృతి చెందగా, ఈ ఘోర సంఘటన దృశ్య మనవడి పెళ్లి ఆగిపోవడంతో మనస్తాపానికి గురై తాత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట మండల పరిధిలోని బాచారంలో చోటు చేసుకుంది. బాచారం గ్రామానికి చెందిన సొంగ రమేష్‌కు సంగారెడ్డి జిల్లా అందోల్‌కు చెందిన మమతతో పెళ్లి కుదిరింది. గురువారం పెళ్లి జరగాల్సి ఉండగా పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రాక్టర్ అందోల్ మండలం మాన్‌సాన్ పల్లి వద్ద బుధవారం సాయంత్రం బోల్తాపడి పెళ్లి కొడుకు తరపు బంధువులు ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో రమేష్, మమతల పెళ్లి ఆగిపోయింది. ఈ అనూహ్య సంఘటనతో తీవ్ర మనస్థాపానికి గురైన నరేష్ తాత పెంటయ్య గురువారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాచారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఒకే రోజు నలుగురి అంత్యక్రియలు

పెళ్లికూతురును తీసుకురావడానికి వెళ్లిన ట్రాక్టర్ బోల్తా పడగా పెళ్లి కుమారుడి బంధువులు ఆగమ్మ (42) బూదెమ్మ 52 జిట్టిగారి సంగమ్మ 45 మృతి చెందగా మనబడి పెళ్లి ఆగిపోయిందని అతని తాత సొంగ పెంటయ్య 65 ఆత్మహత్య చేసుకోగా గురువారం సాయంత్రం బాచారంలో నలుగురి అంత్యక్రియలు నిర్వహించడంతో బాచారం గ్రామం మొత్తం శోకసాంద్రంలో మునిగిపోయింది. బుధవారం రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన వార్త తెలిసిన నుంచి గ్రామంలో ఏ ఒక్క ఇంట్లో పోయ్యి ముట్టించలేదు కదా ఏ ఒక్కరిని పలకరించిన విషాదగాదే కనిపించింది. వీరి అంత్యక్రియలలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈఎస్ఐ డిస్పెన్సనరీ అద్దె చెల్లించకపోవడం శోచనీయం

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని ఈఎస్ఐ డిస్పెన్సనరీ వైద్యశాలకు రెండు సంవత్సరాలుగా ప్రభుత్వాలు అద్దె చెల్లించకపోవడం హేయమైన చర్య అని సిఐటియు జిల్లా సహా కార్యదర్శి ఎస్ మహిపాల్ అన్నారు. తక్షణమే అద్దె చెల్లించి వైద్యశాలను పూర్తిస్థాయిలో కార్మికులకు వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ పట్టణం రోజు రోజుకు పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందుతుంది కనుక జహీరాబాద్లో 50 పడకల ఈఎస్ఐ వైద్యశాలను ఏర్పాటు చేయాలని తాము గతం నుండి ఎన్నో పోరాటాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ప్రతి నెల కార్మికుల నుండి ఈఎస్ఐ కు రెండు లక్షల రూపాయలు ఇక్కడి నుండి వెళుతున్నాయి. దానికి అనుగుణంగా కార్మికులకు సేవలు అందించేందుకు వైద్యశాలను ఏర్పాటు చేయకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జహీరాబాద్ లో కార్మికుల ఎక్కువగా ఉన్నందున రోజు 200 మంది ఓపి పేషెంట్లు ఉంటున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీసం 50 పడకల ఈఎస్ఐ వైద్యశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శాశ్వత వైద్యులు లేకపోవడంతో వైద్య సేవలు కూడా కార్మికులకు సక్రమంగా అందడం లేదని అన్నారు. రెండు వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి వాటిని తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులందరి సమక్షంలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రాములు నర్సింలు చంద్రకాంత్ జహీర్ రాజు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాల మెరుగుదల కోసం బీఈఎక్స్‌ఎల్‌తో గీతం అవగాహన





నవతెలంగాణ-పటాన్ చెరు

విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడానికిగాను బీఈఎక్స్ఎల్ ఇండియా కన్సల్టింగ్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గురువారం అవగాహన ఒప్పందం చేసుకుని, తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అధికారికంగా ప్రకటించాయి. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్. ప్రొఫెసర్ సి.ఆర్.శాస్త్రిల సమక్షంలో ఈ అవగాహన కుదిరింది. గీతం-బీఈఎక్స్ ఎల్ మధ్య సహకారం భారతీయ నిర్మాణ పరిశ్రమలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించడమే గాక, సామర్థ్యాన్ని పెంచడం, జాప్యం లేదా న్యాయాలను తగ్గించడంపై దృష్టి సారించింది. బీఈఎక్స్ఎల్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్‌ల సూట్‌ను ఉపయోగించి ఓపెన్ బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (బీఐఎం), ఇంటిగ్రేటెడ్ బీఐఎం వినియోగాన్ని ప్రోత్సహించడం, గీతం విద్యార్థులకు అవసరమైన డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ శిక్షణ అందించడం, అధునాతన బీఐఎం మేనేజ్మెంట్ టెక్నిక్‌లో పరిశోధనను ప్రోత్సహించడం ఈఎంవోయూ లక్ష్యం. ఇందులో భాగంగా, స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'బీఈఎక్స్ ఎల్ మేనేజర్ ను ఉపయోగించి నిర్మాణ నిర్వహణ కోసం ఇంటిగ్రేటెడ్ 5డీ బీబీఎం' పేరిట, ఆ సంస్థ సీనియర్ కన్సల్టెంట్ మన్సూర్ అహ్మద్ ఆతిథ్య ఉపన్యాసం చేశారు. నిర్మాణ పరిశ్రమలో బీఐఎం ప్రాముఖ్యత, పరిశ్రమ భవిష్యత్తు కోసం. దాని వినియోగం వంటి అంశాలను ఆయన వివరించారు. బీఐఎంను వినియోగించే విధానం, తద్వారా ఒనగూరే ప్రయోజనాలను అదే సంస్థ కన్సల్టెంట్ జి.సుప్రియ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చేసి చూపారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్, అఖిలేష్ అతిథులను స్వాగతించి, జ్ఞాపికలతో సత్కరించగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీల్ నందిపాటి వందన సమర్పణ చేశారు. ఈ అవగాహన పరిశ్రమ-విద్యా సంస్థ మధ్య సహకారాన్ని పెంపొందించడమే గాక, నిర్మాణ రంగ అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక నైపుణ్యాలు, జ్ఞానంతో విద్యార్థులను ప్రోత్సహించే వీలు కల్పిస్తోంది.

కార్మికులకు కనీస వేతనాలు అందించాలి

మంత్రిని కోరిన సిఐటియు నాయకుడు విద్యాసాగర్



నవతెలంగాణ-జోగిపేట

పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల కనీస వేతనాలు సవరణ చేయాలని కోరుతూ సీఐటీయూ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ మంతి్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ నిచ్చిన పిలుపు మేరకు గురువారం రాత్రి జోగిపేటలో మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు సవరణ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు.

మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి కూతురు పెళ్లికి హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ



నవతెలంగాణ- జోగిపేట

జోగిపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. కృష్ణారెడ్డి కూతురు వివాహానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. గురువారం హైదరాబాదు లోని ఓం కన్వెన్షన్ లో జరిగిన వివాహానికి ఆయన హాజరై వధూవరులు కీర్తి రెడ్డి, నిషాన్ రెడ్డిలను ఆశీర్వదించారు. నూతన వధూవరులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలి

న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగేలా చర్యలు.
జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు , జిల్లా ఎస్పీ రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి

పార్లమెంట్ ఎన్నికలలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగేలా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ నియంత్రణ, ఎన్ఫోర్స్మెంట్ కమిటీ, గ్రీవెన్స్ కమిటీ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ,ఎస్పీ రూపేష్ లు మాట్లాడారు.ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ప్రలోభాలు , జప్తులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాలను నియంత్రించ డానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టిలలో పట్టుబడిన నగదుకు రసీదు అందించి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అందజేయాలన్నారు. చెక్ పోస్టుల్లో అన్ని రకాల వాహనాల తనిఖీలు చేయాలన్నారు. తనిఖీల సందర్భంలో నియమ నిబంధనలు పాటించాలన్నారు. బార్డర్ చెక్పోస్టుల్లో తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. సిసి కెమెరాల పర్యవేక్షణ 24 గంటలు ఉండాలన్నారు. అభ్యర్థులు సువిధ యాప్ లో అన్ని అనుమతులు పొందవచ్చని తెలిపారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ఖర్చు 90 లక్షలకు మించ రాదన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు నిర్వహించే రోడ్ షోలు ఫంక్షన్లలో భోజనాలు ఖర్చు లను ఎఫ్ ఎస్ టి టీములు రికార్డు చేయాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్ ప్రచారాలు



నిలిపివేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి అనుమతితో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఖర్చుల వివరాలు అకౌంటింగ్ టీం అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతరత్రా ఖర్చుల పైన ఎస్ ఎస్ టి , ఎఫ్ ఎస్ సి టీం లో చెకింగ్ పై దృష్టి సారించాలన్నారు. నేషనల్ హైవే 65 పై చెకింగ్ పాయింట్స్ వద్ద ప్రాపర్ గా అన్ని వాహనాలను చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. సి విజిల్ యాప్ 1950 గురించి ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సివిజిల్ యాప్ లో వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో పరిష్కరించాలన్నారు . లక్ష రూపాయలకు మించి జరిగిన లావాదేవీల వివరాలు అందించాలని ఎల్డీఎం కు ఆదేశించారు. సీజ్ చేసిన నగదు వివరాలు ఈ ఎస్ ఎం ఎస్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టర్ బ్యాలెట్ ఫారం 12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. చెక్పోస్టుల్లో జరిగే తనిఖీల్లో రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లేవారు తగిన ఆధారాలు చూపించాలన్నారు. జిల్లా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ తనిఖీల సమయంలో చెక్పోస్టులవద్ద ప్రజలను భయభ్రాంతులకు గురి చేయకుండా తగిన సూచనలు చేయాలని తనిఖీల్లో పట్టుబడ్డ నగదుకు రసీదు అందించాలని తెలిపారు . రాజకీయ నాయకులకు సంబంధించిన నగదు తరలింపు పై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించి నగదు పట్టుబడితే ఎఫ్ఐఆర్ బుక్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రచార వాహనాల కు అనుమతి పత్రాలను పరిశీలించాలన్నారు వాహనాల నెంబర్లు పరిశీలించాలన్నారు. ప్రచారాల్లో డీజే లు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తీసుకొని వచ్చే వాహనాలను తనిఖీ చేయాలన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు వాహనాలకు అనుమతులు ఉన్నాయన్నారు సోషల్ మీడియాలో వచ్చే రూమర్స్ పై 24 గంటల్లో వివరణ ఇవ్వాలని, ఎంక్వైరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆర్డీవోలు ఎక్సైజ్ ఫారెస్ట్ సకల సిబ్బంది ఏ ఆర్ ఓ లు , నోడల్ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్ , మాధురి , డి ఆర్ ఓ పద్మజారాణి ,జడ్పీసీఈఓ జానకిరెడ్డి , డి ఎఫ్ ఓ శ్రీధర్ ,ఎల్ డి ఎం గోపాల్ , ఏ ఆర్ ఓ లు, ఆర్ టి ఓ అధికారులు ,ఎక్సైజ్ అధికారులు, అటవీశాఖ అధికారులు , ,ఎన్నికల సంబంధిత అధికారులు పాల్గొన్నారు ..

మహిళ అదృశ్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణం ప్రశాంత్ నగర్ కు చెందిన మహిళ(42) ఈనెల 26న సాయంత్రం 5.00 గంటలకు తన భర్త కిషన్ తో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే తిరిగి ఇంటికి రానందున మహిళ భర్త కొండి కిషన్ తన భార్య తప్పిపోయినట్టు సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ నందు దరఖాస్తు చేయగా కేసు నమోదు చేశామని సంగారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ భాస్కర్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు కింది ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవలసినదిగా తెలియజేశారు. సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్: 08455 276333, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్: 8712656718

తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్ల అందజేత

భారతి సిమెంటు సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్



నవతెలంగాణ-జోగిపేట

తాపీ మేస్త్రిలకు భారతి సిమెంట్ సంస్థ తరపున మంజూరైన ప్రమాద బీమా బాండ్లను భారతి సిమెంట్ సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ అందచేశారు. గురువారం స్థానిక షిరిడి సాయిబాబా ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులకు ఈ బాండ్లను అందజేశారు. రోబోటెక్ క్వాలిటీ, జర్మనీ టెక్నాలజీ, టాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్ వంటి అత్యున్నత ప్రమాణాలతో భారతి సిమెంట్ను అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం మేస్త్రీలందరికి లక్ష రూపాయల ప్రమాద భీమా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో ఏరియా అస్సిటెంట్ మేనేజర్ గంగాధర్ రెడ్డి, శిరిడి సాయిబాబా ట్రేడర్స్, మార్కెటింగ్ డీలర్ నర్సింలు, కంపెనీ ప్రతినిధులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

సోదర భావాన్ని పెంపొందిస్తున్న ఇఫ్తార్ విందులు



నవతెలంగాణ - జహీరాబాద్

రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేస్తున్నటువంటి ఇఫ్తార్ విందులతో సోదర భావం పెరుగుతుందని ఎంఈఓ బస్వరాజ్ అన్నారు. బుధవారం సాయంత్రం జహీరాబాద్ పట్టణంలోని ఇస్లామిక్ సెంటర్లో ఉపాధ్యాయ సంఘం(ఐటా) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఐటా నాయకులు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసి సర్వ మతాల వారికి ఆహ్వానించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. వివిధ వర్గాలకు చెందిన ఉపాధ్యాయులు మేధావులను ఇలాంటి విందులలో పిలిచి వారికి గౌరవ పరచడంతో సమాజంలో మంచి సంకేతాలు వెళతాయని అన్నారు. ఈ సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాలగోపాల్ సభ అధ్యక్షులు నాజింగోరి ,బసవరాజ్ ,జనార్ధన్, తులసీరామ్ మహియుద్దీన్ ,సయ్యద్ రఫ్, అహ్మద్, సయ్యద్ ఆఫీస్, రామచంద్రపురం వంశీ షాహిన్ విద్యాసంస్థల ఎండి మహమ్మద్ సురాన్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు ముఖ్య అతిథులకు తెలుగులో అనువదించబడినటువంటి ఖురాన్ ను పంపిణీ చేశారు.

వైద్యశాలలో కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు చెల్లించాలి



నవతెలంగాణ - జహీరాబాద్

స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో వివిధ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీతాలను తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ అధ్యక్షులు ఎస్ మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం వైద్యశాల సుపరింటెంట్ డాక్టర్ శ్రీధర్ కు మెమొరండాన్ని అందించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టు కార్మికులకు నెలనెల జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అన్నారు. ఈ విషయమై తక్షణమే ప్రభుత్వం కల్పించుకొని జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బకాయిలు చెల్లించని దుకాణాలు సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు



నవతెలంగాణ - జోగిపేట

ఆందోల్-జోగిపేట పురపాలక సంఘము లోని గాంధీ పార్క్ షాపింగ్ కాంప్లెక్స్ లోని దుకాణాల సముదాయములోని కొంతమంది షాపు అద్దె బకాయిలు సరిగా చెల్లించకపోవడంతో గురువారం మున్సిపల్ అధికారులు దుకాణాలను సీజ్ చేశారు. వారికీ పలుమార్లు నోటీసు ఇచ్చినప్పటికీ అద్దె చెల్లించ లేనందున పురపాలక సంఘము రెవిన్యూ ఇన్స్ పెక్టర్ టి.నారాయణ అధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది తో కలిసి మొండి బకాయిలు ఉన్న దుకాణాలను 2019 పురపాలక చట్టము మరియు రెవిన్యూ రికవరీ ఆక్ట్ ప్రకారం సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఓ టి ఎస్ వన్ టైం సెటిల్మెంట్ స్కీం లో ఆస్థి పన్ను వడ్డీ పై 90% మాఫీ ఉన్నందున ఇట్టి అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని, నీటి బిల్లు, వృత్తి వ్యాపార లైసెన్సులు రుసుము చెల్లించాలని కోరారు. 2023-24 మార్చ్ 31 తో ముగిస్తున్నందున మీ యొక్క లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని ఆయన కోరారు.

వివాహ వేడుకల్లో చంద్రశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నాగలిగిద్ద మండలం ఉట్పల్లి గ్రామానికి చెందిన మేత్రి బండేప్ప కూతురి వివాహ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోల చంద్రశేఖర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ నాయకులు దీంగబెర్ రెడ్డి, గుండె రావు పాటిల్, మాజీ సర్పంచ్ లు నర్సప్ప, మాజీ ఎంపీటీసీ సంజీవ్ రెడ్డి, సంజీవ్, రాంరెడ్డి, అశోక్ డీలర్,సంగ్రామ్, రాజు, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి

నవ తెలంగాణ - రాయికోడ్ : మండల పరిధిలోని నగ్వార్ గ్రామంలో మాజీ జడ్ పి టి సి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజయ్య అధ్వర్యంలో బీ ఆర్ ఎస్ను వీడి అలిగే రవీందర్, పెద్దదొడ్డి, ఏసన్ బ్యాగరి. లక్ష్మయ్య కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్,విఠల్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంగంపేటలో ఆంజనేయ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ - జిన్నారం : జిన్నారం మండల పరిధిలోని మంగపేట గ్రామంలో వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు స్థానిక భక్త బృందం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో గడచిన మూడు రోజులుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల పరిషత్తు అధ్యక్షులు దమ్మ గౌని రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు గంగు రమేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చెక్ పోస్ట్‌ల నిర్వహణ

ఎన్నికల దృష్ట్యా అందుబాటులో అధికారులు, సిబ్బంది
అధికారులకు పలు సూచనలు చేసిన
జిల్లా ఎస్పీ శ్రీ చెన్నూరి రూపేష్

నవతెలంగాణ - జహీరాబాద్

రానున్న పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ రూపేష్ అన్నారు. గురువారం మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్లో భాగంగా జహీరాబాద్ మహీంద్రా గెస్ట్ హౌస్ నందు జహీరాబాద్ సబ్-డివిజన్ పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్) లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్ లో వుండాలని, గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏవిధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి అనే విషయాలపై తగు సలహాలు మరియు సూచనలు చేశారు. ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల ఆన్లైన్, మోసాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరంతరం ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నేర నియంత్రణలో, జరిగిన నేరాన్ని ఛేదించడంలో సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, స్వచ్ఛందంగా వారి గ్రామాలలో, ప్రధాన కూడళ్లల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. నేరాల నియంత్రణతో పాటు దర్యాప్తుకు



దోహదపడే సి.సి. కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు వివిధ కుల సంఘాలవారు ముందుకు రావాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లా ప్రజలందరు ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని, ఎవరు కూడా ఇతర పార్టీలను గాని వ్యక్తులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయరాదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టరాదన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జహీరాబాద్ డియస్పి రామ్ మోహన్ రెడ్డి, టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి, రూరల్ ఇన్స్పెక్టర్ నాయిమోద్దీన్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, సబ్-డివిజన్ ఎస్.ఐ.లు, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాపై పట్టు కోసం మంత్రి నజర్...

వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులతో మంతనాలు....!
ఎంపీ ఎన్నికల కంటే ముందే భారీగా చేరికలు చేసేందుకు ఏర్పాట్లు..

నవతెలంగాణ - జహీరాబాద్

ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నందు పూర్తిస్థాయిలో పట్టు సాధించేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఇతర పార్టీలకు చెందినటువంటి శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యులు, వివిధ శాఖలకు చెందిన మాజీ చైర్మన్లు, ద్వితీయ శ్రేణి నాయకులతో సైతం మంత్రి నేరుగా టచ్ లో ఉన్నట్లు తెలుస్తుంది. మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడడంతో పాటు అభివృద్ధికి అందరూ సహకరించాలని దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేస్తూనే ఉమ్మడి జిల్లాలో ఉన్నటువంటి బీఆర్ఎస్ పార్టీకి చెందిన శాసనసభ్యులను ఇదివరకే చర్చలు జరిపి స్వయంగా ముఖ్యమంత్రి వద్దకు పంపించడంలో కీలకపాత్ర పోషించారని చర్చ నడుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలను సైతం చాలెంజ్గా తీసుకున్న దామోదర్ రాజనర్సింహ తనకు ఉన్నటువంటి రాజకీయ అనుభవం ,పలుకుబడి, మాట తత్వాన్ని వినియోగించి ఎదుటి పార్టీకి చెందిన నాయకులు అందర్నీ గాల వేసేందుకు చేస్తున్నటువంటి ప్రయత్నాలు కొంతమేరకు ఫలించినట్లు తెలుస్తుంది. టిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు శాసనసభ్యులతో చర్చలు జరిపి ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించేందుకు అంగీకారం కుదిరినట్లు తెలుస్తుంది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరగనున్నందున ఇప్పటినుంచే పార్టీని బలోపేతం చేసేందుకు దామోదర్ రాజనర్సింహ తనకంటూ ప్రణాళిక రూపొందించుకున్నారని కాంగ్రెస్పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో తనతో ఎప్పుడూ కలవని, మాట్లాడని నాయకులను సైతం మంత్రి నేరుగా రాయబారం పంపించి వారితో సంప్రదింపులు చేస్తుండటం గమనార్హం. జహీరాబాద్, సంగారెడ్డి, మెదక్ సిద్దిపేట్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆయా ప్రాంతాల్లోని ప్రథమ శ్రేణి నాయకులతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు చురుకైన కార్యకర్తలకు సైతం ఆకర్షించేందుకు మంత్రి ఎన్నో విధాల ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తుంది. బీఆర్ఎస్ పార్టీలో ఒక్కొక్క నియోజకవర్గంలో కొంతమంది నాయకులు ఆ పార్టీ అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంతో మిగతా నాయకులు పార్టీ అధిష్టాన నిర్ణయం పట్ల విముక్తిత వ్యక్తం చేస్తూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి వలపన్నుతున్నట్లు తెలుస్తుంది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు ఎన్ని పరిణామాలు ఏఏ పార్టీలో చోటు చేసుకుంటాయి వేచి చూడాలి మరి.

ప్రహరీ ఏర్పాటు చేయాలని ఆవేదన

ఎన్నో ఏండ్లుగా ఇదే సమస్య



నవ తెలంగాణ - న్యాల్ కల్

మండలంలోని ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన బోధన చేస్తామని చెప్తున్నప్పటికీ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కరువయ్యాయి ఎన్నో ఏండ్లుగా పాఠశాలకు ప్రహరీ గోడ లేక నానా అవస్థలు పడుతున్నారు. 30 ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ గోడలు లేకపోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నారు గ్రామాలలో చాల్కీ , రాఘవపూర్ , చినిగేపల్లి , రేజింతల్ , ఆయా ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడలు లేక విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు చదివే సమయంలో పందులు స్వైర విహారం రోడ్డుపై వాహన శబ్దాలతో ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు నిరుపయోగంగా వధాగా ఉంటున్నాయని ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో సమస్యలను ప్రభుత్వం చొరవ చూపి మంజూరు చేయాలని విద్యార్థులు వాపోతున్నారు .

వసతులు కోసం నివేదికలు పంపాం
మండల ఎంఈఓ మారుతి రాథోడ్

మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ గోడలు లేవు. 4850 మంది ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు చదువుతున్నారు . దీనిపై మండల ఎంఈఓ మారుతి రాథోడ్ను నవ తెలంగాణ వివరణ కోరగా ప్రతి సంవత్సరం పాఠశాలల మౌలిక వసతుల కోసం జిల్లా ఉన్నతాధికారులకు మంజూరు కోసం నివేదిక పంపిస్తున్నామని చెప్పారు.

వాహనాల తనిఖీలు



నవతెలంగాణ - గుమ్మడిదల

గుమ్మడిదల మండలం టోల్గేట్ పరిసరాల ప్రాంతంలో రానున్న పార్లమెంట్ ఎన్నికలో భాగంగా ఓటర్లు డబ్బు, మద్యంకు బానిసలు కాకుండా మండలాల వారిగా వాహనాల తనిఖీలు నిర్వహించుటకు వివిధ శాఖల అధికారులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియమించాయి. విధుల్లో భాగంగా గురువారం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ వాహనాలను ఎన్నికల పర్యవేక్షణ అధికారులు దామోదర్, ఎస్సై మహేశ్వర్ రెడ్డి పోలీస్ అధికారులు తదితరులు కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తమ విధులు నిర్వహించుటకు అధికారులకు సహకరించినట్లు తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్నికల పర్యవేక్షణ తనిఖీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ శిబిరం

డిడబ్ల్యూఓ లలిత కుమారి





నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశాలమేరకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని 10 కేజీబీవీ కస్తూర్బా పాఠశాలలో బాలికలకు వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమాన్ని ఈనెల 9 నుంచి 28 వరకు నిర్వహించడం జరిగిందని డి డబ్ల్యూ లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 10 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 10 రోజులపాటు వాయిస్ ఫర్ గర్ల్స్ క్యాంప్ని , మొదటి దశ పరిచయాన్ని నిర్వహించడం జరిగింది అని అన్నారు. శిబిరంలో బాలికలు యుక్త వయసు, ఋతుక్రమ ఆరోగ్యం, ప్రాథమిక హక్కులు హింస గురించి తెలపడంజరిగిందన్నారు. సంస్కృతి సమాజం నిర్దేశించినట్లుగా బలం, అందం లింగం యొక్క ప్రమాణాలను ఆత్మ పరిశీలన చేసుకోవడానికి వారిని ప్రోత్సహిస్తోంది అని అన్నారు. వారు సవాళ్ళను అధిగమించడానికి వివాదాలను పరిష్కరించడానికి సులభమైన మార్గాల గురించి ఆలోచిస్తారు. ఈ కార్యక్రమాలను జి సి డి ఓ మాధవి ,జిల్లా సమన్వయ కర్త పల్లవి పర్యవేక్షిస్తున్నారు

కార్మికులకు నష్టం చేసే జీవోలను సవరించాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్



నవతెలంగాణ -జహీరాబాద్

కార్మికులకు నష్టం చేసే విధంగా ప్రభుత్వం తీసుకు వచ్చినటువంటి జీవోలను వెంటనే సవరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్యరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చినటువంటి జీవోలతో కార్మికులకు జీతంలో కూడా కోత విధించే విధంగా ఉన్నాయని అన్నారు. ఎక్కడైనా కార్మికుల సంక్షేమం కోసం జీవోలు తీసుకువస్తే అందులో వారి జీతాలు పెరుగుతాయి కాని ఈ ప్రభుత్వాలు తీసుకువచ్చినటువంటి జీవులతో కార్పోరేట్ వ్యవహారాల వారికి లాభం చేకూరే విధంగా కార్మికులకు నష్టం చేకూరే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ విషయమై తాము ఇప్పటికే జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా తమ సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాలుగా ఆందోళనలు చేపడుతూ మెమోరండాలను విజ్ఞప్తులను ఇవ్వడం జరిగిందని అన్నారు .ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, నర్సింలు, తిరుపతి ,చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

స్లోక దా స్కూల్ పై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రల్ల మహేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

పర్మిషన్ లేకుండా, బిల్డింగ్ పూర్తికాకముందే అడ్మిషన్లు తీసుకుంటున్న స్లోక దా స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రల్ల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిఇఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ బిల్డింగ్ లో బిల్డింగ్ పూర్తి కాకుండా పర్మిషన్ లేకుండా అడ్మిషన్లు ఓపెన్ అని బోర్డు పెట్టి అడ్మిషన్లు తీసుకుంటున్న స్లోకా దా స్కూల్ యజమానిపై చర్యలు తీసుకొని విద్యార్థులకు తల్లిదండ్రులకు మోసం చేసే విధంగా ప్రచార ఆర్భాటాలు చేస్తున్న యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి అడ్మిషన్లు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు లేకుండా అడ్మిషన్లు ఏ విధంగా తీసుకుంటారని ప్రశ్నించారు. స్కూల్ కి పర్మిషన్ లేదని అడ్మిషన్లు తీసుకోవద్దని విద్యాశాఖ అధికారులు ప్రెస్ మీట్ నిర్వహించి తల్లిదండ్రులు మోసపోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పర్మిషన్ లేని పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల ఉద్యమాల బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవి కిరణ్, అనిల్, పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

ఆర్డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్

నవతెలంగాణ-పెద్దశంకరంపేట



ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆర్ డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామకార్యదర్శులు, మిషన్ భగీరథ వాటర్మెన్లకు తాగునీటి శాంపిల్ సేకరణపై అవగాహన కల్పించారు. ఆయా ట్యాంకుల నుంచి మూడు రకాలుగా షాంపిల్స్ను సేకరించి, రికార్డులో పొందుపర్చాలన్నారు. క్లోరినేషన్ తప్పకుండా చేపట్టాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామపంచాయితీలకు క్లోరోసిప్ పరికరాలను అందజేశారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ రమేష్, ల్యాబ్ సిబ్బంది రమేష్, వన్ఇన్స్పెక్టర్ కిషన్ తదితరులున్నారు.

జై హెూ తులసి సినిమా సక్సెస్ మీట్

షూటింగ్‌కు ఆకర్షణీయంగా మారిన చౌబే ఫామ్ హౌస

నవతెలంగాణ-చిలిపిచేడ్ : మండల పరిధిలోని విష్ణుదేవ్ చౌభే ఫామ్ హౌస్ సినిమా షూటింగ్‌కు ఆకర్షణీయవంతంగా మారింది. జై హెూ తులసి మైయ్యా భోజాపురి సినిమా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సినిమా దర్శకత్వం అశుతోష్ కారే, రాకేష్ దేవగన్, మంజిత్ సింగ్, దిలీప్ సింగ్ ఆధ్వర్యంలో హీరో హీరోయిన్ సుమిత్ సింగ్ ఇంద్ర వన్ని, ప్రీతి మౌర్య నటిస్తున్నారు. ఈ నెల 21 నుంచి మరొక సినిమా దూల నెంబర్ వన్ ప్రారంభమైందని అన్నారు. ఈ సినిమాకు నిర్మాత రుస్తుం అలీ చిస్తి, నటీనటులు మనోజ్ టైగర్, మంతులాల్, చంచల్ సింగ్, రాదే, అంజలి సింగ్, కెమెరా మ్యాన్ వికాస్ మందల్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణుదేవ్ చౌబే, అమిత్ చౌబే, హనుమాన్ జీలు మాట్లాడుతూ మండలంలో ఇలాంటి ఫామ్ కట్టడం మా అదృష్టమన్నారు. సినిమా ఇండస్ట్రీ చిలిపిచెడ్ మండలం మా ఫామ్ హౌస్‌లో సినిమాలు చిత్రీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఐదు సినిమాలు, నాలుగు సీరియల్ స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. హీరోయిన్ ప్రీతి మౌర్య హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు.

ప్రజావాణి రద్దు : జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ - మెదక్



మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ప్రజావాణిని రద్దు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

మాజీ ఉపసర్పంచ్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ-నిజాంపేట



నిజాంపేట గ్రామ తాజా మాజీ ఉప సర్పంచ్ కొమ్మట బాబుపై దాడి చేసిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి టీఎస్ నాయకులు ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ముత్యాల భూపాల్, రాష్ట్ర కార్యదర్శి ఎర్రలింగం లు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో నేటికీ దళితులపై దాడులు జరుగుతున్నాయని, దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలన్నారు. ఒక దళిత మాజీ ఉపసర్పంచ్‌పై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. పోలీసులు వెంటనే సమగ్ర విచారణ జరిపి దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోని పక్షంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. దాడులు పునరావతం కాకుండా చూడాలన్నారు. దాడులు కొనసాగితే దాడులకు ప్రతి దాడులు తప్పవన్నారు. రెయిన్బో వెంచర్ దగ్గర 33 ఫీట్ల రోడ్డు విషయంలో ఈ దాడి జరిగిందన్నారు. దాడి చేసిన రియల్ ఎస్టేట్ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాజమల్లు, మెదక్ జిల్లా అధ్యక్షుడు పిల్లుట్ల రాములు, డప్పు శ్రీనివాస్, ఎల్లయ్య, కొమ్మట సందీప్‌లు పాల్గొన్నారు.

నీలం మధుకు టికెట్ కేటాయింపు పట్ల హర్షం

ముదిరాజ్ పాపన్నపేట మండల అధ్యక్షుడు కిష్టయ్య ముదిరాజ్

నవతెలంగాణ-పాపన్నపేట



పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ టికెట్ నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించడం పట్ల పాపన్నపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ముశెట్టి కిష్టయ్య ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో అత్యంత జనాదరణ కలిగిన బిడ్డగా, అట్టడుగు స్థాయి నుంచి, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా, స్వతహాగా ఎదిగిన నీలం మధు ముదిరాజును కాంగ్రెస్ పార్టీ గుర్తించి టికెట్ ఇవ్వడం పట్ల కాంగ్రెస్ పార్టీకి, సహకరించిన ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులకు కిష్టయ్య ముదిరాజ్ కృతజ్ఞతలు తెలియజేశారు. నీలం మధును అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాష నైపుణ్యంపై సదస్సు

నవ తెలంగాణ-మెదక్ టౌన్



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ ఆంగ్ల విభాగం పక్షాన భాష నైపుణ్యాలు వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా తారా డిగ్రీ కాలేజీ సంగారెడ్డికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఏ. విశ్వేశ్వర శర్మ భాషా నైపుణ్యాలు వ్యక్తిత్వ వికాసం పై ఏ విధమైన ప్రభావాన్ని చూపెడతాయో సోదాహరణంగా వివరించారు. ఒక వ్యక్తి వికాసంలో భాషా నైపుణ్యాల ప్రాధాన్యతను తెలియజేశారు. ఆంగ్ల భాష అభ్యాసం వలన వ్యక్తులలో కలిగే ప్రవర్తన, మర్యాదలను గురించి కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి వై.ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఎస్ కిరణ్ కుమార్, ఎం రవీందర్, టీఎస్ కే సి అంజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు మానసిక ఆరోగ్యంపై సదస్సు

నవ తెలంగాణ-మెదక్ టౌన్



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వారి సౌజన్యంతో విద్యార్థిని విద్యార్థులకు జీవన నైపుణ్యాలు మానసిక ఆరోగ్యం అంశంపై సదస్సు నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ సింహా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుంచి సునీత రాకేష్ రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసి జీవితం, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. మనం పెరుగుతున్న పరిసరాల వలన మన వ్యక్తిత్వం నిర్మితమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అధికారిని నాగమణి, కళాశాల శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ దినకర్, ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమలరెడ్డి, గణిత శాస్త్ర విభాగాధిపతి వెంకటేశ్వర్లు, జంతు శాస్త్ర విభాగాధిపతి డా. విశ్వనాథం, రసాయన శాస్త్ర విభాగాధిపతి రమణ, సుధారాణి, మౌనిక, వేణుగోపాల్ రావు, సైన్సు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద వధువుకు పుస్తె మట్టెలు

నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రంలో నిరుపేద అయిన కూరాకుల కనకయ్య కూతురు దివ్య వివాహం గురువారం జరిగింది. దివ్య వివాహానికి దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు, ఎర్రం శ్రావణ కుమార్ (బాబీ) వైస్ ఎంపీపీ సుజాత లు వధువుకు పూస్తె మట్టెలు, పట్టు చీర అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని, పేదల కష్ట సుఖాలలో పాలుపంచుకోవడం అసలైన గొప్పతనం అని, గతంలో కూడా పేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేశామని, భవిష్యత్తు లో కూడా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యెమికే నారాయణ, మన్నే గణేష్, ఎర్రం అనిల్, కూరాకుల రాములు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి జూనియర్ కాలేజీ మంజూరు చేయాలి

నవతెలంగాణ-నిజాంపేట



ప్రతి మండల కేంద్రంలో ఒక జూనియర్ కాలేజీ ఉండాలని ప్రభుత్వ నిబంధనలున్నప్పటికీ నేటికీ నిజాంపేట మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ లేకపోవడం విద్యలో వెనుకబాటు తనానికి నిదర్శనమని మండల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ఎన్నో జూనియర్ కాలేజీలు మంజూరు చేసినా నిజాంపేట మండల కేంద్రానికి కాలజీ మంజూరు చేయకపోవడం చాలా శోచనీయమన్నారు. జూనియర్ కాలేజీ మంజూరు చేయాలని గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందన్నారు. మండలంలో ప్రతి సంవత్సరం 500 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తుంటారని, మండలానికి జూనియర్ కాలేజీ మంజూరు చేస్తే విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోడానికి వీలవుతుందన్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు స్పందించి ఈ అకాడమిక్ ఇయర్ లోనే జూనియర్ కాలేజీ మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.,,,

"మమా" అనిపించేస్తుండ్రు

- బేటీ బచావో బేటీ పడావో అమలుకు జిల్లా ఎంపిక
- తూతూ మంత్రంగానే అవగాహన కార్యక్రమాలు
- విస్తృత ప్రచారం చేయడంలో అధికారుల వైఫల్యం



నవతెలంగాణ-మెదక్

సమాజంలో ఆడ పిల్లల పట్ల చిన్న చూపు, వివక్ష, అసమానతలను తొలగించి లింగ నిష్పత్తిని పెంచి సంక్షేమ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న భేటీ బచావో భేటీ పడావో (బిబిబిపి) పథకం నీరుగారుతోంది. ఆడపిల్లలను రక్షించండి, చదివించండి అనే నినాదంతో విస్తృత ప్రచారం చేయాల్సిన అధికారులు తూతూ మంత్రంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మమా అనిపించేస్తున్నారు. భేటీ బచావో భేటీ పడావో అమలుకు మెదక్ జిల్లా ఎంపిక కావడం శుభపరిణామమే అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాలికను సంరక్షించు, బాలికను చదివించు (భేటీ బచావో-బేటీ పడావో) కార్యక్రమం అమలుకు మెదక్ జిల్లా ఎంపిక కావడం జరిగింది. ఇందుకోసం రూ. 20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయిలో కార్యక్రమాన్ని అమలుచేయాల్సి ఉంది. కానీ అందుకుభిన్నంగా పథకం అమలు తీరు జరుగుతుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

లింగ వివక్ష, మహిళా సాధికారత గురించిన ఆందోళనలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భేటీ బచావో భేటీ పడావొ పథకం అధికారుల నిర్లక్ష్యం వలన నీరుగారుతోంది. లింగ వివక్షను సమూలంగా రూపుమాపడం, ఆడ శిశువును స్వేచ్ఛగా బతకనివ్వడం, సంరక్షణకు పెద్దపీట వేయడంతో పాటు ఉన్నత విద్య అందించి అన్ని కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి పురుషులతో సమానంగా తీర్చిదిద్దడమే పథకం అంతిమ లక్ష్యంగా చెప్పవచ్చు. ఆడపిల్లలను రక్షించడం, చదివించడం, భ్రూణహత్యలు, ఆడ శిశుహత్యల వంటి అమానవీయ చర్యలను అరికట్టడం పథకం ఉద్దేశ్యం. ఇందుకోసం పథకానికి సంబంధించిన సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి మాస్ కమ్యూనికేషన్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, విద్యలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, పిల్లలకు ఆత్మ రక్షణ శిక్షణ ఇవ్వడం, సామాజిక మార్పు కోసం అవగాహన ర్యాలీలు నిర్వహించడం, ప్రభుత్వ సంస్థలు, పాఠశాలల ఉద్యోగులను సమన్వయం చేసుకొని పథకం ఉద్దేశ్యాన్ని విస్తృత ప్రచారం చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లా సంక్షేమ శాఖ అధికారి పథకం ప్రచారం విషయంలో బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పథకం అమలుకు రూ.20 లక్షలు

బిబిబిపి పథకం అమలుకు మెదక్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం రూ. 20 లక్షలు కేటాయించడం జరిగింది. ఈ నిధులను జిల్లాలోని నర్సాపూర్, మెదక్, రామాయంపేట, అల్లాదుర్గం నాలుగు ప్రాజెక్టులకు బాలికల భవిష్యత్ దృష్ట్యా కేటాయించాల్సిన అవసరం ఉండే. జిల్లాలో కళాజాత, ప్రచార బోర్డులు, గోడల మీద ప్రచార పెయింటింగ్స్, మాక్ పార్లమెంట్, ఆడపిల్లలకు బ్యుటీషియన్, కంప్యూటర్ కోర్సులు, స్పోర్ట్స్‌లో శిక్షణ తరగతుల నిర్వహణ, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు, మరుగుదొడ్ల ఏర్పాటు, కమ్యూనిటీ లెవల్ ప్రోగ్రామ్స్ వంటివి నిర్వహిస్తూ పండుగ వాతావరణంలో పథకాన్ని లక్ష్యం వైపు చేరువ చేయాలి. కానీ జిల్లా సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ అవేమీ చేయకుండా జిల్లాకు కేవలం రూ.5 లక్షలను మాత్రమే ఉపయోగించడాన్ని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు ప్రాజెక్టులలోని సిడిపివో లకు ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున ఇచ్చి అంగన్వాడీ, ఆశా సిబ్బంది ద్వారా బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పి చేతులు దులిపేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 31వ తేదీతో ఈ పథకానికి వచ్చిన నిధులను జిల్లాకు సరిగ్గా వినియోగించకుంటే నిధులు ల్యాప్స్ అయి వెనక్కి వెళ్లిపోయే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి భేటీ బచావో భేటీ పడావో పథకానికి వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇప్పటి వరకు రూ. 5 లక్షలు ఖర్చు

బ్రహ్మాజీ, జిల్లా సంక్షేమాధికారి, మెదక్.



మెదక్ జిల్లా ఈ ఏడాది భేటీ బచావో భేటీ పడావో పథకానికి ఎంపిక కావడం జరిగింది. ఇందుకోసం ప్రభుత్వం కేటాయించిన రూ. 20 లక్షల్లో ఇప్పటి వరకు రూ. 5 లక్షలు మాత్రమే ఖర్చు చేశాము. మిగితా నిధులు ఈ నెల 31 వరకు ఖర్చు చేయాలి లేకుంటే వెనక్కి పోతాయి. ఇప్పటి వరకు జిల్లాలోని నాలుగు ప్రాజెక్టుల సిడిపివోలకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ప్రోగ్రామ్స్ నిర్వహణ కోసం ఇచ్చాము. మెదక్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో మాక్ పార్లమెంట్ నిర్వహించాం. మెదక్ నియోజకవర్గంలో 22 మందికి డివైఎస్ఓ ఆధ్వర్యంలో ఒక్కో విద్యార్థికి రూ.3 వేలు చెల్లిస్తూ కంప్యూటర్, బ్యుటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. జిల్లాలో మొత్తం 10 మంది విద్యార్థినులకు స్పోర్ట్స్ డ్రెస్ ఇచ్చాము. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న వారికి సన్మానాలు, ఓకే పాప ఉంటే ప్రోత్సాహక బహుమతులు ఇచ్చాము. కెజిబివి, డిగ్రీ కాలేజ్‌లో అవగాహన తరగతులు, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ లను నేర్పిస్తున్నాము.

వేసవి నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

మహిళలు ఖాళీ బిందెలతో కనిపిస్తే అధికారులపై చర్యలు తప్పవు

మిషన్ భగీరథ నీరు ప్రతి గడపకు అందాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జిల్లాలో త్రాగు నీటి సరఫరాపై గూగుల్ మీట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి ప్రారంభమైన దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి ప్రణాళిక బద్ధంగా మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. మహిళలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీ బిందెలతో నీటి కోసం తిప్పలు పడుతున్నట్లు కనిపిస్తే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ గడపకు వెళ్ళాలని తెలియజేశారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాలలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో తిరిగి త్రాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలన్నారు. అన్ని గ్రామాలలో వెంటనే బోర్ల మరమ్మత్తులు, ఫ్లషింగ్ చేయించాలని ఆదేశించారు. త్రాగు నీటిని వృధా కాకుండా గ్రామాలలో ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలతో అవగాహన కల్పించాలన్నారు. కార్యాచరణ ప్రణాళికపై వారంలోగా నివేదికలు సమర్పించాలని తెలిపారు. జిల్లాలోని మండలాలు, హబిటేషన్స్‌లో త్రాగు నీటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలన్నారు. త్రాగు నీటి పైప్ లైన్ లేని ప్రదేశాలలో ట్యాంకర్ సహాయంతో నీటి సరఫరా అయ్యేలా చూడాలని తెలిపారు. ఎంపిడిఓలు ముందే గ్రామాల వారిగా సమీక్షించుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో గ్రామాలలో ఓహెచ్ఎస్ ట్యాంకులను శుభ్రంగా ఉంచి, వ్యాధులను నివారించుటకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేయడంలో ఇబ్బందులు ఎదురైతే నీటి సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని, స్థానికంగా ఉన్న నీటి వనరులు, బోరు బావులను గుర్తించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న త్రాగు నీటి పంపులు, బోరు బావుల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద త్రాగునీటి సరఫరా కోసం చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, ప్రతీ బస్తి, ప్రతి మున్సిపల్ వార్డులో త్రాగునీటి సరఫరా ప్రణాళికలు రూపొందించుకోవాలని, నీటి లీకేజీలను ఎప్పటికప్పుడు నియంత్రించేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. త్రాగునీటి సరఫరా హెడ్ డిస్ట్రిబ్యూటర్ ఇంట్రా స్థాయిలో నీటి లెవల్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఏదైనా సమస్య అయితే సకాలంలో స్పందించి వాటిని త్వరగా పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, సంబంధిత అధికారులు, ఎంపిడిఓలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొలిటికల్ బ్రోకర్ మామిళ్ల ఆంజనేయులు..

ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకోం

బట్టలూడదీసి తరిమికొడతాం

దేవేందర్ రెడ్డి ఊచలు లెక్కపెట్టే రోజులు దగ్గరపడ్డాయి

కాంగ్రెస్ నేతలు సురేందర్ గౌడ్, జీవన్ రావు

నవతెలంగాణ - మెదక్



కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు పొలిటికల్ బ్రోకర్ అని, స్థానిక ఎమ్మెల్యేను విమర్శిస్తే బట్టలూడదీసి తరిమికొడతామని కాంగ్రెస్ శ్రేణులు సురేందర్ గౌడ్, న్యాయవాది జీవన్ రావు హెచ్చరించారు. గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మెదక్ లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో నాయకుల మెప్పుకోసం మాజీ ఎమ్మెల్యే పద్మ ప్రస్థానాన్ని కూల్చిన ఎమ్మెల్యే గురించి అనుచితంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. పార్టీ మారినప్పుడు ఒప్పదం ప్రకారం బ్యాలెన్స్ డబ్బుల రికవరీ కోసం పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మెప్పుకోసం ఎమ్మెల్యే పై ఇష్టానుసారంగా మాట్లాడటం అతడి మూర?త్వానికి నిదర్శనమన్నారు. రాజకీయ విమర్శలు అభ్యంతరకరంగా ఉండోద్దని, రాజకీయకక్ష్య దురుద్దేశంతో మాట్లాడటం సరికాదన్నారు. గత పదేళ్లుగా మంత్రి పదవిలో ఉండి ఇలాంటి పదజాలంతో మాట్లాడుతున్న నాయకులను ప్రోత్సహిస్తున్న హరీష్ రావు నాయకత్వంలో పనిచేసినందుకు సిగ్గు పడుతున్నామన్నారు. విమర్శలకు ప్రతి విమర్శలు తప్పకుండా చేస్తామన్నారు. దేవేందర్ రెడ్డి, లావణ్య రెడ్డిల అవినీతిని బయటపెట్టి మెదక్ సబ్ జైల్లో ఊచలు లెక్కపెట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. అవినీతి అక్రమల పై చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. వేదికల పై ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడాలని, పబ్బం గడుపుకోవడనికి ఇలాంటి పనులు చేస్తే ఊరుకోమన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, నాయకులు లక్ష్మి, జ్యోతి, బొజ్జ పవన్, హరిత, పరుశురాం, శంకర్, రాజా సింగ్, సుందర్ సింగ్, రమేష్ రెడ్డి, రాజీ రెడ్డి, కృష్ణ, పోచెందర్, రమేష్ గౌడ్, సిద్ధా గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి

ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-నార్సింగి



మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుపై మెదక్ కౌన్సిలర్ మామిల్ల ఆంజనేయులు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని మెదక్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ హెచ్చరించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోవర్ధన్ మాట్లాడుతూ ఇటీవల మెదక్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుపై మెదక్ కౌన్సిలర్ మామిల్ల ఆంజనేయులు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీలో ఉండి డబ్బులకు ఆశ పడి బీఆర్ఎస్ పార్టీకి మారిన ఆంజనేయులుకు ఎమ్మెల్యేను విమర్శించే నైతిక హక్కు లేదని, వెంటనే ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, లేక పోతే దళిత విభాగం నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బాలాజీ, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు మల్లేశం, మాజీ వార్డు సభ్యుడు బాలాజీ నరసింహ గౌడ్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్ ను మిల్లర్లు త్వరిత గతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

శ్రీ సత్య సాయి రైస్ మిల్, శ్రీధర్ ఇండస్ట్రీస్ ను ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ- కొల్చారం



సీఎంఆర్ కు సంబంధించిన బియ్యాన్ని మిల్లర్లు త్వరితగతిన పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కొల్చారం లోని శ్రీ సత్య సాయి రైస్ మిల్, శ్రీధర్ ఇండస్ట్రీస్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం డెలివేరి, యాసంగి రబి 2022-23 కు సంబంధించిన పెండింగ్ ధాన్యాన్ని వెనువెంటనే అప్పగించాలన్నారు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ పనితీరు ఆదర్శనీయంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే 2021-22 రబీ, 2021-22 ఖరీఫ్ ధాన్యం బియ్యం అప్పగింతలు పెండింగ్ ఉన్న మిల్లర్లు ఈనెల ఏప్రిల్ 30వ తారీకు లోగా డెలివరి పూర్తి చేయాలని, లేనిపక్షంలో పెండింగ్ ఉన్న మిల్లర్ల పై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని హెచ్చరించారు. అలాగే వానాకాలం బియ్యం టెండర్ పూర్తైన ధాన్యంను వెనువెంటనే అప్పగించి, బియ్యం డెలివరిలో జిల్లాను ముందు వరుసలో నిలపాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్, సివిల్ సప్లై హరికృష్ణ, ప్రణీత, సాదిక్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

నవ తెలంగాణ- దుబ్బాక

పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని దుబ్బాక మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ తెలిపారు. గురువారం జరిగిన జీవశాస్త్రం పరీక్షకు దుబ్బాక పురపాలిక పరిధిలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 814 మంది విద్యార్థులకు 813 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారని, అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట ఉన్నత పాఠశాలలో 107 మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు.

మైసమ్మ దేవాలయ ప్రతిష్టకు హాజరైన ఎమ్మెల్యే

నవ తెలంగాణ- మిరుదొడ్డి



అక్బర్ పేట మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో గల శ్రీలక్ష్మి నరసింహ రైస్ మిల్లు లో నూతనంగా ప్రతిష్ఠించిన మైసమ్మ ఆలయాన్ని గురు వారం రోజున దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బక్కి వెంకటయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మైసమ్మ దయవల్ల రైతులందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు. ఆయనతోపాటు అక్బర్ పేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రవి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మోహన్ రెడ్డి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్ కు ప్రహరీ గోడ నిర్మించాలి

ప్రభుత్వము నిధులు మంజూరు చేసిన పనులు మొదలుపెట్టని కాంట్రాక్టర్

విద్యార్థులకు రక్షణ కరువు పనులు వెంటనే మొదలు పెట్టాలనీ గ్రామస్తుల వేడుకోలు

నవతెలంగాణ- నిజాంపేట



గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నిజాంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ కు దాదాపు 21 లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని వాటి పనులను నేటికీ మొదలు పెట్టకపోవడం ఏమిటని గ్రామస్తులు వాపోతున్నారు. హై స్కూల్ కు ప్రహరీ గోడ లేక స్కూల్ లోపలికి పందులు కుక్కలు జంతువులు విపరీతంగా వచ్చి అశుభ్రతకు కారణం అవుతున్నాయి. డైనింగ్ హాలు, కిచెన్, కరెంటు వైర్ ఫిట్టింగ్, ప్రహరి గోడ నిర్మించాలని ప్రభుత్వము 21 లక్షలు కేటాయించడం జరిగిందని ప్రస్తుతము కేవలము కరెంటు ఫిట్టింగ్ మాత్రమే చేయడం జరిగిందని మిగతా పనులు చేయలేదని పలువురు వాపోతున్నారు. విద్యార్థులు మధ్యాహ్న సమయంలో భోజనం చేసే వేళలో జంతువులు ఆటంకాలు కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరి గోడ నిర్మించాలని గతంలో ఎన్నోసార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని కనీసం నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైన వెంటనే తగు చర్యలు తీసుకొని ప్రహరి గోడ నిర్మించేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాళం వేసిఉన్న రెండు ఇళ్లలో చోరీ

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడినట్లు గౌరారం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే గోవిందపూర్ గ్రామానికి చెందిన లింగ శ్రీనివాస్, మరియు కేసరి రామవ్వ ఇద్దరి ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇద్దరి ఇళ్లలో సుమారు 3 తులాల బంగారం,118 తులాల వెండి చౌర్యానికి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరూ తమ ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్తున్నప్పుడు విలువైన వస్తువులు ఇంట్లో పెట్టవద్దని సూచించారు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతలకు వెళ్లినట్లైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కరువు బీఆర్ఎస్ ప్రభుత్వ సృష్టే

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి



నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్రంలో ఏర్పడిన కరువు పదేండ్లు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వ సృష్టియేనని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి గురువారం ఆరోపించారు. వర్షపాతాన్ని బీఆర్ఎస్ నాయకత్వం రాజకీయం చేస్తూ ప్రజలను మళ్లీ మోసం చేస్తుందన్నారు. దెబ్బతిన్న పంటల పరిశీలనలో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై చేసిన వాఖ్యలను రత్నాకర్ రెడ్డి ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రజలకు ఎన్ని హామీలిచ్చి, ఎన్ని అమలు చేశారో ప్రజలకు అవగాహన ఉందన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజలిచ్చిన తీర్పును అపహాస్యం చేసేలా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తురన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్ల వచ్చిన కరువు కాదని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టారాజ్యాంగ పరిపాలించిన తీరు వల్ల వచ్చిన కరువని రత్నాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

తప్పుడు పత్రాలతో పదోన్నతి

- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు
- కౌన్సిల్ ఫర్ ఆర్టీఐ స్టేట్ ప్రెసిడెంట్ షాదుల్



నవ తెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వాన్ని, అధికారులను మోసం చేస్తూ తప్పుడు పత్రాలు సృష్టించి పదోన్నతి పొందిన సిద్దిపేట మున్సిపాలిటీలో ప్రస్తుతం మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న గుర్రం శ్రీనివాస్‌రెడ్డి పై విచారణ జరిపించాలని కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేసినట్లు కౌన్సిల్ ఫర్ ఆర్టీఐ స్టేట్ ప్రెసిడెంట్ షాదుల్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి న్యాయబద్ధకంగా రూల్స్ పాటించకుండా, తప్పుడు పత్రాలను సృష్టించి, పదోన్నతి పొందాడని తెలిపారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. అందుకే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నెగ్గిన అవిశ్వాసం

- సమావేశానికి హాజరైన 9 మంది సభ్యులు
- నేరుగా క్యాంపు నుంచి సమావేశానికి



నవతెలంగాణ-కొండపాక : కొండపాక మండల ఎంపీపీ రాగల సుగుణపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. కొండపాక ఎంపీపీపై ఈ నెల 5న అవిశ్వాసం ప్రకటిస్తూ 9 మంది సభ్యులు ఆర్డీవోకు అవిశ్వాస తీర్మాణ పత్రం అందజేశారు. దాంతో ఆర్డీవో బన్సీలాల్ అవిశ్వాస తీర్మాణ సమావేశానికి తేది ప్రకటించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. తీర్మానం ఇచ్చిన నాటి నుంచి క్యాంపులోకి వెళ్లిన ఎంపీటీసీ సభ్యులు నేరుగా సమావేశ మందిరానికి వచ్చారు. సమావేశానికి 9 మంది హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలపడంతో నిబంధనల ప్రకారం అవిశ్వాసం నెగ్గిందని ఆర్డిఓ బన్సీలాల్ ప్రకటించారు. కొండపాక మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా కుకునూరుపల్లి ఎంపీటీసీ స్థానం నుంచి పోటీ చేసిన గీత ఆరోగ్యంతో మృతి చెందింది. దాంతో 13 మంది ఉన్నారు. సమావేశానికి మూడింటిలో రెండు వంతుల మంది సభ్యులు కావలసి ఉండగా అంతేమంది హాజరయ్యారు. నివేదికను పై అధికారులకు పంపిస్తామని అధికారుల సూచన మేరకు ఎంపీపీ ఎన్నిక కోసం తేదీ ప్రకటిస్తామని ఆర్డీవో తెలిపారు. కాగా కొండపాక మండలం ఎంపీపీ స్థానం బీసీ మహిళకు కేటాయించడంతో కొండపాక ఎంపీటీసీ సభ్యురాలు మంచాల అనసూయకు దక్కనుంది.

పోలీసు బలగాల మధ్య

కొండపాక ఎంపీపీ అవిశ్వాస సమావేశం సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యాలయం ఆవరణలో పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. అవిశ్వాసానికి సరైన కోరం ఉండడం వల్ల ప్రశాంత వాతావరణంలో అవిశ్వాసం నెగ్గింది.

నిధులు గౌరవం లేకపోవడంతోనే పార్టీ మారాను

ఎంపీటీసీ మంచాల అనసూయ

ఐదేళ్ల పాలనలో ఎంపీటీసీలకు ఎలాంటి నిధులు ఇవ్వకపోవడంతో పాటు ఎలాంటి గౌరవం ఇవ్వకపోవడంతోనే బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు కొండపాక ఎంపీటీసీ సభ్యురాలు మంచాల అనసూయ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చడంతో పార్టీ పట్ల ఆకర్షితులై మండల అభివృద్ధి కోసం పార్టీలో చేరినట్టు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు

అవిశ్వాసంపై సమావేశం జరుగుతుండడంతో కొండపాకకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీపీ స్థానం లభిస్తుందనే భావనతో ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు అనంతుల నరేందర్, మంచాల చిన్న శ్రీనివాస్, రెడ్డేమైన రవీందర్, వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాసరెడ్డి, కోల ఉపేందర్. ఐలం యాదవ్. కనక రాములు తదితరులున్నారు.

వృద్ధులకు సహాయం



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ వనిత సిద్దిపేట ఆధ్వర్యంలో కాపర్తి స్వరూపారాణి దుర్గయ్య దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా భారత్‌నగర్‌లో శ్రీ వృద్ధాశ్రమంలోని 20 మంది వృద్ధులకు కిరాణా సరుకులు, స్వీట్, ఖారా అందజేసినట్లు క్లబ్ అధ్యక్షురాలు వాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్యాల వీరేశం, కాపర్తి స్వరూపారాణి, దుర్గయ్య అంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పుస్తే మట్టెలు అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన శిగురుపల్లి సంతోష చంద్రయ్య దంపతుల కూతురు అంకిత వివాహానికి తాజా మాజీ సర్పంచ్ పాములపర్తి తిర్మల్ రెడ్డి, తీర్మాలన్న యువసేన తరుపున పుస్తెమట్టెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, తాజా మాజీ ఉప సర్పంచ్ పద్మ నర్సింలు, నాయకులు క్రాంతి కుమార్ లక్ష్మణ్, కిష్టయ్య, తదితరులున్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి.



నవతెలంగాణ-తొగుట

మండలం చందాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సత్తయ్య కూతురు వివాహం గజ్వేల్ లక్ష్మణ గార్డెన్‌లో గురువారం జరిగింది. ఈ వివాహ వేడుకల్లో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

31న అశు కవితా పద్యధార సాహిత్య కార్యక్రమం

నవతెలంగాణ-సిద్దిపేట: సిద్దిపేటలోని హరిహర రెసిడెన్సి సమీపంలో గల లలిత చంద్రమౌళీశ్వర దేవాలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు దేవాలయ నిర్వాహకులు పండరి రాధాకష్ణ, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం తెలిపారు. లలిత చంద్రమౌళీశ్వర దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు జరుగనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలలో కూచిపూడి నత్య ప్రదర్శన, అవధానులు దోర్భల ప్రభాకరశర్మ, ములుగ అంజయ్య, తీగుళ్ళ శ్రీకాంతశర్మ ఆధ్వర్యంలో అశు కవితా పద్యధార కలదని తెలిపారు. రాష్ట్రస్థాయిలోని ప్రముఖ పద్య కవులు పాల్గొంటున్న సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని సాహితీ ప్రియులు, కవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నవవధువుకు పుస్తే మట్టెలు అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండలం పాములపర్తి గ్రామానికి చెందిన సంతోష, చంద్రయ్య దంపతుల కూతురు అంకిత వివాహానికి పుస్తే మెట్టెలను గురువారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాసి బాలయ్య, కృష్ణ, స్వామి,పోచయ్య, రఘుపతి, నర్సింలు, పోచయ్య తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట జిల్లా సీపీ అనురాధ



నవతెలంగాణ-మద్దూరు

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట జిల్లా సీపీ అనురాధ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోకసభ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులకు సిబ్బందికి నిర్వహించవలసిన విధులు, విధానాల గురించి అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు. ప్రతి గ్రామంలో విపిఓ ఉండాలని, ప్రతి గ్రామంలోని సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలని, గ్రామంలో ఉన్న పెద్దలు యువకులతో కలిసి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని ఆమె తెలిపారు. ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తించాలని, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆమె కోరారు. అంతకుముందు కేసు వివరాలను, సిబ్బంది విధులను, పోలీస్ స్టేషన్ పరిసరాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్, చేర్యాల సిఐ ఎల్ శ్రీను, మద్దూరు ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీ, ఏఎస్ఐలు జిల్లా జగదీష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వాహనాల తనిఖీ

- ఎస్సై సిహెచ్.తిరుపతి



నవతెలంగాణ-కోహెడ

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలను పోలీసులు పకడ్బందీగా నిర్వహించారు. గురువారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లాలో చెక్‌పోస్టలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఎవరైన ఎలాంటి ఆధారాలు లేని నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచెసే వస్తువులను, మాదకద్రవ్యాలను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. చెక్‌పోస్టలో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే రూ50 వేల పైబడి నగదు తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు రమేష్ నాయక్, గంగుల రాజు, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కలర్ టీవీ అందజేత



నవతెలంగాణ-నంగునూరు

బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని నంగునూరు ఎంఈఓ తగిరెడ్డి దేశిరెడ్డి, నోడల్ ఆఫీసర్ ప్రభాకర్ రావులు అన్నారు. గురువారం నంగునూరు మండలం బద్దిపడగ ప్రాథమిక పాఠశాలకు బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ వారు 55 ఇంచుల కలర్ టీవీ, ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల విద్యాధికారి దేశిరెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ ప్రభాకర్ రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజానికి తన వంతుగా సేవ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ వారు చేస్తున్న కృషి అమోఘమని పేర్కొన్నారు. బద్దిపడగ ప్రాథమిక పాఠశాలకు కలర్ టీవీ, ప్రింటర్‌ను అందజేసిన బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత కృతజ్ఞతలు తెలుపుతూ వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి కోర్తివాడ కిషన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం రాజేశ్వర్ రెడ్డి, బాలలక్ష్మి, శశిరేఖ, రవి, ఉపాధ్యాయులు కత్తుల రామిరెడ్డి, సంగు రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంలో బయోచార్ పాత్ర కీలకం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలో పలు గ్రామాలకు నూజివీడు సీడ్స్ వారు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 200 మెట్రిక్ టన్నుల బయోచార్ సేంద్రియ ఎరువును రైతులకు ఉచితంగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ బయోచార్ అనేది తక్కువ-ఆక్సిజన్ వాతావరణంలో 250 కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలకు పంట అవశేషాలను వేడి చేయడం ద్వారా తయారు చేయబడిన బొగ్గు రూపమన్నారు.. ఈ బయోచార్ ఎరువు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, నేలలో కార్బన శాతాన్ని పెంచుతుందని తెలియజేశారు. నేల నీటి నిల్వ చేసే సామర్థ్యాన్ని మొక్కలు పోషకాలను వినియోగించుకునే సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి డా. టి నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న జనాభా వల్ల కలిగే ఒత్తిళ్ల ఫలితంగా వ్యవసాయ భూమి క్షీణత సమస్య దీర్ఘకాలిక పంట ఉత్పత్తి వ్యూహాన్ని అవలంబించాల్సి వస్తుందన్నారు. అవసరం ఉందని కలుషితమైన వ్యవసాయ నేలను సరిచేయడానికి, ఆమ్లతను తగ్గించడం ద్వారా నేల సారాన్ని మెరుగుపరచడానికి, పోషకాల లభ్యతను పెంచడానికి బయోచార్‌ను ఉపయోగించాలని ప్రతిపాదించబడిందని తెలిపారు. ఈ సేంద్రియ ఎరువును ఆయిల్ ఫామ్, కూరగాయల సాగు చెసే రైతులకు అందజేస్తున్నారు. నూజివీడు సీడ్స్ ఏజీఎం నరసింహారెడ్డి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా రూ.20 లక్షల విలువ చేసే దాదాపు 200 టన్నుల బయోచార్‌ను రైతులకు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ఎకరానికి రెండు నుంచి మూడు టన్నుల ఈ బయోచార్‌ను వేసుకోవాలని సూచించారు. మర్కుక్ మండల రైతులకు ఈ బయోచారును ఉచితంగా ఇచ్చినందుకు నూజివీడు సీడ్స్ యాజమాన్యానికి వ్యవసాయ శాఖ తరపున సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సీడ్స్ ప్రతినిధులు ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారులు విష్ణువర్ధన్, రైతులు, తదితరులున్నారు.

ఎస్ఎఫ్ఐ 5వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

- ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్
- జిల్లా మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిద్దిపేట

ఏప్రిల్ 3,4న జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా 5వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ విద్యార్థులను కోరారు. గురువారం జిల్లా మహాసభల వాల్ పోస్టర్స్‌ను ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్న విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. గత సంవత్సరం నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల పోరాటాలపైన సమీక్షా నిర్వహించి, భవిష్యత్తు పోరాటాలకు నాంది పలకడం కోసం ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం వలె విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తుందని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియాంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. సంక్షేమ హాస్టల్‌లలో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ ఛార్జిలను గత ప్రభుత్వం పెంచుతున్నామని జీఓ ఇచ్చినా, గత ప్రభుత్వం అమలు చేయాలేదని, ఈ ప్రభుత్వం కూడా అమలు చేయడం లేదన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలను మూసి, ప్రైవేట్ యూనివర్సిటీలకు ద్వారాలు తెరిచిందన్నారు. పేద ప్రజలకు విద్యను దూరం చేయడమే అని, దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీలను మూసి వేసి ప్రైవేట్ కు అప్పజెప్పే పనిలో ఉందని విమర్శించారు. రానున్న రోజుల్లో విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండంసంజీవ్, నాయకులు వేణు, రవి, ఆకాంక్ష, యశ్వంత్, అభిషేక్, వంశీ, అనుప్రియ, పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ చంద్రమౌళీశ్వర విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

- విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం



నవతెలంగాణ-వర్గల్

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో శ్రీ పరివార సమేత చంద్రమౌళీశ్వర స్వామి ప్రతిష్టా మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య శ్రీ గురుమదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి కరకమలములచే గురువారం ప్రతిష్టా మహోత్సవం నిర్వహించారు. కాగా శ్రీ క్షేత్రం పీఠాధిపతి శ్రీ మధుసూదనానంద తీర్ద ఉత్సవానికి అంకురార్పణ చేయగా, బ్రహ్మశ్రీ నరసింహమూర్తి, బ్రహ్మశ్రీ ఉమామహేశ్వర శర్మ వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా మొదటగా క్షేత్రంలో యాగశాల ప్రవేశము, స్థాపిత దేవతా పూజలు, గర్తన్యాసము, స్వాతి నక్షత్ర యుక్త మేషలగ్న శుభాంశ సుమూహూర్తమున యంత్ర మూర్తి ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. అలాగే కలాన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, బలి ప్రధానం, మహా పూర్ణాహుతి, అవబృత స్నానం, ఆశీర్వచనం, నీరాజనం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా, ఆలయ నిర్మాణదాత అనిల్ గుప్త, అర్చన గుప్త దంపతులను సిద్ధాంతి చంద్రశేఖర శర్మ నేతృత్వంలో ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో శ్రీ సంతాన మల్లికార్జున క్షేత్ర వ్యవస్థాపకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ, కమిటీ సభ్యులు బ్రహ్మశ్రీ యాయవరం రాజశేఖర శర్మ, దాచేపల్లి వెంకటకృష్ణ, సత్యనారాయణ, ఇర్రి మల్లారెడ్డి, బెజగాం వాసుగుప్త, గంగిశెట్టి సుధాకర్ గుప్త వేద గురువులు గుండేశ్వర శర్మ, నాగరాజ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆ మందులు నకిలీవి కావు

- ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారణ
- వివరాలు వెల్లడించిన వ్యవసాయ శాఖ ఏడిఏ



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడకు చెందిన చిలుముల శ్రీనివాస్ అనే రైతు వెలికట్ట శివారులోని పురుగుల మందు దుకాణంలో తెచ్చిన మందులు నకిలీవి కావని పరీక్షల్లో నిర్ధారణ అయినట్టు గజ్వేల్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి బాబు నాయక్ వెల్లడించారు. గురువారం ఐఓసీ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని ప్రియదర్శినితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పురుగుల మందు దుకాణంలో రైతు ఈ నెల 10న నకిలీ మందులు తీసుకపోవడం వల్లనే వరిచేను నష్టపోయిందని ఆందోళనకు దిగాడు. దాంతో వ్యవసాయ శాఖ అధికారులు కంపెనీ శాస్త్రవేత్తలు వ్యవసాయ క్షేత్రంలోని నష్టపోయిన వరి ఆకులను, వరి పంటకు వాడిన మందులను టెస్టింగ్ కోసం రాజేంద్రనగర్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ పరీక్షల్లో తెగుల్ల కోసం తీసుకెళ్లిన మందులు సరైనవేనని, మందులతోపాటు గడ్డి మందు కలపడంతో చేను దెబ్బతిన్నట్టుగా పరీక్షల్లో తేలిందని పేర్కొన్నారు. పంటలకు తెగులు సోకినప్పుడు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి మందులు తీసుకెళ్లాలని, అలాగే రసీదులు తీసుకోవాలని తెలిపాడు. రసీదులుంటే నష్టం జరిగినప్పుడు కంపెనీ నుంచి పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు.

రాజకీయ భీష్ముడు ఎలక్షన్ రెడ్డి

- సముచిత గౌరవం కల్పిస్తాం
- సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి.



నవతెలంగాణ -గజ్వేల్

రాజకీయ భీష్ముడు, డిసిసిబి మాజీ అధ్యక్షులు, గజ్వేల్ సమితి మాజీ ప్రెసిడెంట్ జి. ఎలక్షన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో సముచిత గౌరవం ఉంటుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను గురువారం సిద్దిపేట, మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, గంగుమళ్ల ఎలక్షన్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముదిరాజులకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుండగా, మెదక్ పార్లమెంటు నుంచి తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ పట్టుపట్టి నీలం మధు ముదిరాజును ప్రకటింపజేసినట్లు తెలిపారు. ముఖ్యంగా సిద్దిపేట పూర్వ కలెక్టర్, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి అరాచకాలు, అవినీతిపై విచారణ జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని తెలిపారు. అంతేకాకుండా ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో వివిధ ప్యాకేజీల పేరిట నమ్మించి గొంతు కోసిన ఆయనకు నిర్వాసితులు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి అవినీతి అక్రమాలపై విస్తృత ప్రచారం చేయడంతో పాటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను గెలిపించుకుంటామన్నారు. అయితే 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటు కాగా, ఇంతకాలం ఎమ్మెల్సీగా వెలగబెట్టిన వెంకట్రాంరెడ్డి ఎందుకు పివిఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేయలేకపోయారని నిలదీశారు. వివిధ రకాలుగా తాయిలాలు ప్రకటించి ఓటర్లను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్న వెంకట్రాంరెడ్డి ఈ ప్రాంత ప్రజలను మరోసారి మోసగించలేరని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ డిసిసిబి చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే నేడు దుర్భరదుస్థితి

- ప్రజలకు కాంగ్రెస్ శ్రేణుల సూచన
- మాజీ ఎంపీ,మాజీ ఎమ్మెల్యే వాఖ్యల ఖండన



నవతెలంగాణ-బెజ్జంకి

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఇష్టారీతిన పదేండ్లు పరిపాలించి, ప్రాజెక్టుల పేరున ప్రజా ధనాన్ని లూటీ చేయడం వల్లే నేడు రాష్ట్రం దుర్భరదుస్థితిని ఎదుర్కొంటుందని కాంగ్రెస్ నాయకులు మానాల రవి, డీవీ రావు, మెట్ట నాగారాజు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ లక్ష్మిపూర్ గ్రామంలో కరీంనగర్ మాజీ ఎంపీ, మాజ ఎమ్మెల్యే బుధవారం దెబ్బతిన్న పంటల పరిశీలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను వివరించకుండా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై చేసిన వాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులు ఖండించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడిన కరువును కాంగ్రెస్ పార్టీయే కరువును పునారవృతం చేస్తుందని మాజీ ఎంపీ వ్యాఖ్యలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. పదేండ్ల పరిపాలనలో రైతు బందు, రైతు బీమా పేరునా రైతుల సమస్యలను విస్మరించి నేడు పంటల పరిశీలన పేరునా బీఆర్ఎస్ నాయకత్వం రైతులపై మొసలి కార్చుతున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రజల్లో విశ్వసనీయతను కొల్పోయి మళ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం కరువు అంశంతో రాజకీయం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఖచ్చితంగా నేరవెర్చుతుందని దీమా వ్యక్తం చేశారు.

నూతన అసోషియేషన్ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నూతన టిప్పర్ అసోషియేషన్ కార్యవర్గ ఎన్నికలు గురువారం నిర్వహించినట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా మంకాలి ప్రవీన్, ఉపాధ్యక్షుడిగా సంగ నరేశ్, ప్రధాన కార్యదర్శిగా మంకాలి బాబు, సహాయ కార్యదర్శిగా జెల్లా ప్రభాకర్, కోశాధికారిగా ఎల్కంటి సంతోష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కార్యవర్గ సభ్యులు తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న కార్యవర్గ సభ్యులకు మంకాలి ప్రవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన సీఐ మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో గల స్థానిక పోలీస్ స్టేషన్ ముందు కొనసాగుతున్న బార్డర్ చెక్ పోస్టును గురువారం గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్ రెడ్డి తనిఖీ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లా చెక్ పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు కొనసాగుతున్నాయని గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్ రెడ్డి తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లాలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్రమంగా ఎవరైనా ఎలాంటి ఆధారాలు లేని నగదు , మద్యం ఓటర్లను ప్రలోభాలకు కురిచేసే వస్తువులను, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. చెక్ పోస్ట్‌లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని 24 గంటలు విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, తనిఖీలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వచ్చిపోయే వాహనాలను పరిశీలిస్తూ తనిఖీలు చేయాలని తెలిపారు. రాత్రి సమయాల్లో తనిఖీ చేసేటప్పుడు టార్చ్ లైట్ తప్పక ఉపయోగించాలని తెలిపారు. ప్రజలు, వాహనదారులు కుడా తనిఖీలకు సహకారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మర్కుక్ బీఆర్ఎస్ నేత కాంగ్రెస్‌లోకి

- బీఆర్ఎస్ నేతలు పట్టించుకోక పోవడమే కారణం



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మొర్సు శ్రీనివాస్ రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డిసిసి జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో గురువారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ సముచిత స్థానం లేకపోవడంతోనే పార్టీ మారినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, నాయకులు గుండా శంకర్ గుప్త, గుర్రాల నర్సింలు, జైపాల్ రెడ్డి, సాయిరెడ్డి జితేందర్ రెడ్డి తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
5
శుక్రవారం | 29 మార్చి 2024 | www.navatelangana.com

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణను సక్రమంగా నిర్వహించాలి

- కొమురవెల్లి పోలీస్ స్టేషన్ సందర్శించిన సీపీ



నవతెలంగాణ-కొమురవెల్లి

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. గురువారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌ను కలిసి సందర్శించారు. సభ ఎన్నికల నేపథ్యంలో కొమురవెల్లి పోలీస్ స్టేషన్లను సందర్శించి పోలీస్ అధికారులను సిబ్బందికి నిర్వహించవలసిన విధులు విధానాల గురించి అవగాహన కల్పించారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటినుంచి బైండోవర్ కేసులు నాన్ బేలబుల్ వారెంట్, ఎగ్జిక్యూటివ్, ప్రైవేట్ గన్ డిపాజిట్, సీజ్ చేసిన డబ్బులు, ఫ్లాగ్ మార్చ్, ఎన్ఫోర్స్మెంట్ వర్క్ గురించి అడిగి తెలుసుకున్నారు. హుస్నాబాద్ ఏసీపి సతీష్, చేర్యాల సిఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నవోదయ విద్యాలయంలో బ్యాగ్ లెస్‌డే సెలబ్రేషన్స్



నవతెలంగాణ-వర్గల్

మండలకేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 'బ్యాగ్ లెస్ డే' ని సెలబ్రెట్ చేస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ డి.రాజేందర్ తెలిపారు. 27వ తేదీన వార్షిక పరీక్షలు ముగిశాయని 28 నుంచి 31 వరకు బ్యాగ్ లెస్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉన్నందున 'బ్యాగ్ లెస్ డే' లో భాగంగా విద్యార్థులను వివిధ గ్రూపులుగా విభజించి పెయింటింగ్, గార్డెనింగ్ , హ్యాండీ క్రాఫ్ట్స్, నృత్యం, సంగీత వాయిద్య పరికరాల సహాయంతో అభ్యాసం, గిటార్ శిక్షణ, ఇతర క్రీడల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. 2020 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం 'బ్యాగ్ లెస్ డే' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువుతో పాటు ఇతర క్రీడా, కళ నైపుణ్యాల ద్వార విద్యార్థులు ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఈ సెలబ్రేషన్స్‌లో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రఘునందన్ విజయం కోసం కృషి చేద్దాం



నవతెలంగాణ-దుబ్బాక

త్వరలో జరగబోవు పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మరాటి బాబు కోరారు.రఘుందన్‌రావు విజయమే లక్ష్యంగా ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ పదేళ్ల సుస్థిర పాలన, ప్రశ్నించే గొంతుక రఘునందన్ రావుకు మద్దతుగా నిలిచి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షునిగా దుబ్బాక పురపాలిక కేంద్రానికి చెందిన మరాటి బాబు నియామకమైనట్లు ఆ విభాగం జిల్లా అధ్యక్షులు సత్తి శివకుమార్ గురువారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షులకు, ఎంపీ అభ్యర్థి,మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్యలపై పరిశీలన

నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి, గాంధీనగర్, మాలపల్లె, కుచనపల్లి, పందిళ్ళ, బంజేరుపల్లి , పొట్లపల్లి, మడుద, రాములపల్లి, మహమ్మదాపూర్, ఉమ్మాపూర్, నాగారం గ్రామాలలో తాగునీటి సమస్యలపై పరిశీలించినట్లు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు తాగునీటి సమస్యను పరిశీలించినట్లు తెలిపారు. నీటి ఎద్దటిపై గ్రామాల ప్రత్యేక అధికారులతో చర్చించి సమస్య లేకుండా చూడాలని తెలిపినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో నీటి సమస్య లేకుండా చూడాలని ప్రత్యేక అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.

బకాయి చెల్లించని తిరుమల థియేటర్‌కు తాళం

- మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో తిరుమల థియేటర్ బకాయిలు పేరుకపోవడంతో అనేకసార్లు నోటీసులు ఇచ్చినా యజమాన్యం స్పందించలేదని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. గురువారం తిరుమల థియేటర్‌కు తాళం వేసినట్లు ఆయన చెప్పారు. మార్చి 31లోగా 90 శాతం రాయి తిని సద్వినియోగం చేసుకోవాలని యజమాన్యానికి అనేకసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. పట్టణాభివృద్ధికి పట్టణ ప్రజలు తోడ్పడాలన్నారు. ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో స్కూల్స్, పెట్రోల్ బంక్స్, ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్, వెంటనే బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



నవతెలంగాణ- దుబ్బాక

మెదక్ ఎంపీగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కాంగ్రెస్ దుబ్బాక బ్లాక్ అధ్యక్షులు పాతూరి వెంకట్ స్వామి గౌడ్ కోరారు. గురువారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ, మెదక్ ఎంపీ అభ్యర్థిగా నీలం మధును ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ సబ్బండ వర్గాలకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. అందుకు నిదర్శనమే మెదక్ ఎంపీ అభ్యర్థిగా నీలం మధు ముదిరాజును ప్రకటించడమన్నారు. దుబ్బాక నియోజకవర్గం నుంచి నీలం మధు ముదిరాజ్‌కు భారీ మెజార్టీని అందించాలని కాంగ్రెస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి కూలీల వేతనం పెంపు పట్ల హర్షం

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ- గజ్వేల్

ఉపాధి హామీ కూలీల వేతనం రూ.300 లకు పెంచడం పట్ల డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు హర్షం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సిద్దిపేట్ జిల్లాలో ఉన్న 2 లక్షల జాబ్ కార్డు గల కుటుంబాలను న్యాయం జరగనుందన్నారు.ఏ రటి ఎండలో వర్షంలో సైతం పనిచేసిన ఉపాధి కూలీలకు వేతనం సరిపడక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులలో వేతనం పెంచి కొంత మేరకు ఉపశమనం కలిగించే విషయమన్నారు. పెంచిన వేతనంతో పాటు పనిచేసిన పదిహేను రోజులలో వేతనాలు అందేవిధంగా పని దగ్గర గతంలో మాదిరిగా నీరు, నీడ, ఆయా సౌకర్యాలు కల్పించి ఉపాధి హామీ కూలీల హక్కులను కాపాడుకోవాలన్నారు.

గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పండరి



నవతెలంగాణ -గజ్వేల్

మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన యువ న్యాయవాది ఛెన్ రాజ్ పండరి బార్ అసోసియేషన్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. గజ్వేల్ కోర్టులో గురువారం జరిగిన ఎన్నికల్లో త్రిముఖ పోటీలో 38 ఓట్ల మెజార్టీతో గెలుపొంది, ప్రత్యర్థులకు డిపాజిట్ కూడా దక్కకుండా చేశారు. గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉండగా, మాజీ అధ్యక్షుడు ఏ హరికృష్ణ, సిహెచ్ పండరి, కాజా మిస్కిన్, ప్రెసిడెంట్‌గా బరిలో ఉన్నారు. మొత్తం 53 ఓట్లు పోలింగ్ కాగా అందులో మాజీ అధ్యక్షుడు హరికృష్ణకి 8 ఓట్లు, ఖాజామిస్కిన్‌కి 2 ఓట్లు, సిహెచ్ పండరికి 42 ఓట్లు రాగా, యువన్యాయవాది చెన్‌రాజ్ పండరి 38 ఓట్ల భారీ మెజారిటీతో అఖండ విజయం సాధించారు. ఈ సందర్భంగా సహచర న్యాయవాదులు పండరికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా విష్ణువర్ధన్ రెడ్డి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జిల్లా కోర్ట్ ఆవరణలో నిర్వహించారు. సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా 8 సారి తిరిగి విష్ణువర్ధన్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సుర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీగా అంబరీష్, జాయింట్ సెక్రటరీగా రమేష్, జాయింట్ సెక్రెటరీ ఫర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆక్టివిటీ అశోక్, ట్రెజరర్ మాధవి, లైబ్రరీ సెక్రెటరీ ఆంజనేయులు, లేడీ రెప్రజెంటేటివ్ ఏ లలిత, 30 ఇయర్స్ స్టాండింగ్ ఈసీ మెంబర్ వీర్ మహేందర్, 15 ఇయర్స్ స్టాండింగ్ ఈసీ మెంబర్‌లుగా గ్యనోబా, మహమ్మద్ కాజా నిజాముద్దీన్, 10 ఇయర్స్ స్టాండింగ్ ఈసీ మెంబర్స్‌గా పెంటయ్య, రమాదేవి, 5 ఇయర్స్ స్టాండింగ్ ఏసి మెంబర్స్‌గా విజయ్ కుమార్ వినోద్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎనిమిదవ సారి ఎన్నుకున్నందుకు అడ్వకేట్ సోదరీ సోదరీమణులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అడ్వకేట్ సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

వృధాగా హెర్బల్‌పార్క్





- ఎప్పుడూ మూసి ఉంటున్న ఔషధ మొక్కల పార్క్
- ప్రజల సందర్శనకు నోచుకోని పార్క్

నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రెండు సంవత్సరాలకు గజ్వేల్ పట్టణంలో ఔషధల మొక్కల పార్కును ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్యే కేసీఆర్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించడంతో ఔషధ మొక్కల పార్కు.హెర్బల్ పార్కును నిర్మాణం చేపట్టారు. స్థానిక ఐఓసీ కార్యాలయం సమీపంలో ఎకరం స్థలంలో ఈ పార్కును నిర్మించారు. రూ 50 లక్షల వరకు ఖర్చు అయినట్లు తెలుస్తుంది. పట్టణ ప్రజలకు వివిధ రోగాల రుగ్మతలు ఉన్నవారికి ఔషధ మొక్కల పార్కు ఎంతో ఉపయోగపడుతుందని కేసీఆర్ అధికారులకు వివరించారు. గతంలో గజ్వేల్ స్పెషల్ అధికారిగా పనిచేసిన ప్రస్తుత దేవాదాయ శాఖ కార్యదర్శి హనుమంతరావు చేతుల మీదుగా ఈ పార్కును ఏర్పాటు చేశారు. అయితే ఆర్టికల్చర్ అధికారుల సమక్షంలో ఈ పార్కు ఉన్నట్లు మున్సిపల్ శాఖ అధికారులు గతంలో చెప్పారు. దాదాపు ఏడు సంవత్సరాలు గడుస్తున్న ప్రజలకు పార్కులోకి ప్రవేశం లేదు. చాలామంది పార్కులో ఉదయం వాకింగ్ దారులు, వివిధ రోగా రుగ్మతలు ఉన్న వ్యక్తులు అందులో 45 నిమిషాల పాటు వాక్యం చేస్తే కొంత వ్యాధి నివారణ జరుగుతుందని అందరూ భావిస్తున్నారు. లక్షలు పెట్టి నిర్మించిన పార్కు వృధాగా ఉందన్నారు. మున్సిపల్ సిబ్బంది మాత్రమే అందులో రాలిన ఆకులను రోజు శుభ్రం చేస్తూ పెరిగిన చెట్లను తొలగించే పనులు మాత్రమే చేస్తున్నారు. నిత్యం వందలాది మంది వివిధ వ్యాధులతో సమీపంలో ఉన్న గ్రౌండ్లో వాకింగ్ చేస్తున్నారు. హెర్బల్ పార్కు ప్రారంభం అయితే పార్కులోకి సందర్శించే అవకాశం ఉంది. ఔషధ మొక్కల ద్వారా ప్రజలు కొంతసేపు అలసట తీర్చుకునే అవకాశం ఉంటుంది. హార్టికల్చర్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు తమకు ఇంకా ఆర్టికల్చర్ అధికారులు అప్పగించలేదని చెప్తున్నారు. అయితే మున్సిపల్ సిబ్బంది మాత్రం పార్కును రోజులలో శుభ్రం చేస్తున్నారు. మున్సిపల్ శాఖకు అప్పగించలేదని చెప్తున్నా, అధికారులు ఎందుకు శుభ్రం చేయిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరో విషయం ఏమిటంటే ఆ పార్కులో ప్రజలకు ప్రవేశం లేకుండా పోయింది. దీంతో నాగు పాములు ఇతర విష పురుగులు, విష కీటకాలు అందులో ఉన్నట్లు స్థానికులు సమీపంలో ఉన్న హౌసింగ్ బోర్డ్‌లో నివసిస్తున్న ప్రజలు అధికార దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రజలు తిరిగినట్లయితే విష పురుగులు కీటకాలు దరిదాపుల్లో ఉండవని స్థానిక ప్రజలు అంటున్నారు. అదేవిధంగా పార్కులో బతుకమ్మ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. హెర్బల్ పార్కు ప్రధాన గేటుకు ఎదురుగానే బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో మంచి సుందరీకరణంగా కనిపిస్తుంది. ఇప్పటికైనా హార్టికల్చర్ అధికారులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోని హెర్బల్ పార్కులోకి ప్రజల సందర్శనకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు.

మెదక్ ఎంపీగా భాజపా గెలుస్తుంది

- మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు



నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

మెదక్ పార్లమెంటుగా భారతీయ జనతా పార్టీ గెలవబోతుందని ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో మండల అధ్యక్షులు సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం నారాయణరావుపేట మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు బాబు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఇంటింటా ప్రచారం చేపట్టాలన్నారు. మెదక్ ఎంపీగా తనను భారీ మెజార్టీతో గెలిపించి ప్రజలకు మరింత సేవ చేసేందుకు అవకాశం ఇవ్వాలని సూచించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి ఉద్యోగం చేసుకుంటూ వందల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారని మండిపడ్డారు. దీనిపైన ఈడికి ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, మెదక్ కో కన్వీనర్ సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాబిషన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జిల్లాల రమేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ , ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు బాబు, గ్రామ శాఖ అధ్యక్షులు స్వామి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు బాబు, బూతు కన్వీనర్లు ఇన్చార్జులు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో సముచిత స్థానం దక్కలేదు

- డీసీసీబీ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు పార్టీ, ప్రభుత్వంలో సముచిత స్థానం దక్కలేదని డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గంగుమల్ల ఎలక్షన్ రెడ్డి అన్నారు. గురువారం నవతెలంగాణతో మాట్లాడుతూ 2009లో, 2014, 2018, 2023 లో గజ్వేల్ అసెంబ్లీ స్థానం గజ్వేల్ అసెంబ్లీ స్థానం టికెట్ ఇస్తానని కేసీఆర్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వంలో కూడా తనకు గుర్తింపు తగిన పదవి ఇవ్వలేదన్నారు. 40 ఏళ్ల రాజకీయంలో సతీమణి జెడ్పిటిసిగా, తన అన్న ఎంపీపీగా పార్టీకి సేవ చేసామని అయినా గుర్తింపు లేదన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 40 ఏళ్లలో ప్రజలకు అనేక సేవలు అందించినట్లు ఆయన గుర్తు చేశారు. టిడిపి, బీఆర్ ఎస్ పార్టీ లో కేసీఆర్‌తోనే పని చేశానన్నారు. కనీసం వార్డు మెంబర్ కూడా గెలవని వంటేరు ప్రతాపరెడ్డికి కార్పొరేషన్ పదవులు ఇచ్చారన్నారు. తాను 9 సంవత్సరాలుగా డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసే రైతు సంక్షేమానికి కృషి చేశానన్నారు. పార్టీలో వార్డు మెంబరుగా కూడా గెలవలేని ప్రతాప్ రెడ్డికి పార్లమెంటు టికెట్ ఇస్తానని చెప్పడం తనకు బాధ కలిగిందన్నారు. మెదక్ పార్లమెంటు స్థానాన్ని తనకు ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకపోయినా వాళ్లు పట్టించుకోలేదన్నారు. నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డితో సైతం కేసీఆర్ అనేకసార్లు ఎలక్షన్ రెడ్డికి ఎమ్మెల్యే పదవి ఇస్తానని చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్తో కలిసి పని చేయాలని కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన చెప్పారు. ఏదోవిధంగా ప్రజలకు ప్రజా జీవితాన్ని అందించాలని లక్ష్యంతో పార్టీలో చేరుతున్నట్లు ఆయన చెప్పారు.

మండల కేంద్రంలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-నంగునూరు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో సిద్ధిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో గురువారం పోలీస్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. చిన్నకోడూర్ ఎస్ఐ బాలకృష్ణ, రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి, సర్కిల్ పోలీస్ సిబ్బంది కేంద్ర బలగాలు సిఐఎస్ఎఫ్, సిబ్బందితో కలిసి సీఐ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ శ్రీను మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధమని పేర్కొన్నారు.ఎన్నికలకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950 కాల్ చేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశ పెట్టిన సీ-విజిల్ యాప్ ఎన్నికల పోటీచేసే అభ్యర్థులు కానీ, అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులు కానీ ఓటు వేయమని ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా సమాచారమివ్వాలన్నారు. డబ్బులు ఆశ చూపి ప్రలోభ పెట్టినా, మద్యం డబ్బులు ఓటర్లకు సరఫరా చేసినా ఎలాంటి నేరపూరిత చర్యలకు దిగినా, ఎన్నికల సంఘం నియమావళికి విరుద్ధంగా వ్యవహరించినా, అల్లర్లు, గొడవలకు పాల్పడినా వెంటనే గ్రామాల ప్రజలు యువకులు స్పందించాలన్నారు. సీ-విజిల్ యాప్ మొబైల్ ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని ఫోటోలు వీడియోలు తీసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

నేడు సిద్దిపేటలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

నవతెలంగాణ -నంగునూరు

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం 12:00 గంటలకు సిద్దిపేట లోని కొండా మల్లయ్య, కొండా భూదేవి గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జరుగుతుందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, మెదక్ ఎంపీ అభ్యర్థి పి. వెంకట్రాంరెడ్డి హాజరవుతారని చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు, వార్డ్ మెంబర్లు, ఎంపీటీసీలు, మండల పార్టీ సీనియర్ నాయకులు, మండల మాజీ ప్రజా ప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, డైరెక్టర్లు, కో -ఆపరేటివ్ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గం, పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, విద్యార్థి విభాగం నాయకులు, కార్యవర్గ సభ్యులు, యువజన విభాగం నాయకులు, కార్యవర్గ సభ్యులు, పార్టీ మహిళా విభాగం నాయకులు.రైతుబంధు సమితి గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్లు, బూత్ ఇన్చార్జులు, 100 ఓట్ల ఇంచార్జిలు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అందరూ సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల కోడ్‌లో రంజాన్ తోఫాల పంపిణీ వద్దు

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు రంజాన్ తోఫాలను పంపిణీ చేయవద్దని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఓట్లు దండుకునేందుకు ముస్లిం ప్రజలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్నారన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా అధికారులు మాత్రమే ముస్లిం ప్రజలకు రంజాన్ తోఫాలను అందించాలన్నారు. గ్రామాలు, మండలాల్లో రెవెన్యూ అధికారులు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్, అధికారులు మాత్రమే అందజేయాలని కోరారు. ఎలాంటి నాయకుల ఫోటోలు పెట్టవద్దన్నారు. కొందరు తంజీం నాయకులు బీఆర్ఎస్ నాయకుల ఫోటోలు పెట్టి, గుట్టు చప్పుడు కాకుండా టోకెన్లు అందిస్తూ రంజాన్ తోఫాలను అందిస్తున్నట్లు ఆరోపించారు. ప్రజలకు రంజాన్ తోఫాలు అందించడంలో తాము వ్యతిరేకం కాదని, వాటిని బీఆర్ఎస్ నాయకులు అందజేయడమే తప్పుగా భావిస్తున్నామన్నారు. ఇకనైనా ఎన్నికల అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్ , ఎన్ఎస్ యుఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రషద్, అనిల్, చోటు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు



నవతెలంగాణ-దుబ్బాక

జరగబోవు పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని సీఐ పీ.శ్రీనివాస్ చెప్పారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతీ ఓటరు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. గురువారం పురపాలిక కేంద్రంలో సీఐ పీ.శ్రీనివాస్ నేతృత్వంలో సీఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలు దుబ్బాక సర్కిల్ పరిధిలోని దుబ్బాక, భూంపల్లి,మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ల సిబ్బంది తో కలిసి దుబ్బాక పట్టణంలోని పలు ప్రధాన వీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ, బాధ్యతగల భారత పౌరులుగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నచ్చిన నాయకునికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు డబ్బు, మద్యం, ఇతర బహుమతుల వంటి ప్రలోభాలకు గురి చేస్తే వెంటనే 1950 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో దుబ్బాక, మిరుదొడ్డి, భూంపల్లి ఎస్ఐలు వీ.గంగరాజు, రవికాంత్, పరశురాం, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా రామచంద్రం



నవతెలంగాణ-రాయపోల్

బీజేపీ సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా గజ్వేల్ రామచంద్రంను నియమిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్ రామచంద్రం మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు గెలుపే లక్ష్యంగా పార్టీ పునర్నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం గెలుపొంది ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి బహుమతిగా ఇస్తామన్నారు. తనపై నమ్మకముతో ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు కేటాయించినందుకు దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు శివకుమార్, ఎస్సీ మోర్చ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ మంకిడి స్వామి, మండల అధ్యక్షులు రాజ గౌడ్‌తో పాటు తన ఎన్నికకు సహకరించిన బిజెపి నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో మెదక్ పార్లమెంటు స్థానాన్ని గెలవడమే లక్ష్యంగా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీలో చేనేత విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ వేములఘట్‌లో గురువారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం చేనేత విగ్రహావిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్, గజ్వేల్ ప్రజ్ఞపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వేముల ఘట్ మాజీ ఉపసర్పంచ్ బాలకిషన్ గుప్త మాట్లాడుతూ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చేనేత విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయం తర్వాత చేనేత వృత్తికి విశేష ప్రాధాన్యత ఉందని పద్మశాలి సమాజానికి చేనేత విగ్రహావిష్కరణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞపూర్ పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, పద్మశాలి యువజన అధ్యక్షులు ప్రేమ్ కుమార్, నాగరాజు నేత, ఎల్లంరాజు, లక్ష్మణ్, సత్యనారాయణ, తుమ్మ నర్సింలు, బలరాం, హనుమాన్‌దాస్, విలాస్, వెంకటేష్, తిరుపతి, నరేష్, అరుణ్, పెంటయ్య, జనార్ధన్, పద్మశాలి సంఘం నాయకులు, యువకులు, మహిళలు, ఆర్ అండ్ ఆర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పుర్ర నర్సింలు



నవతెలంగాణ-రాయపోల్

తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పుర్ర నర్సింలు మాదిగను నియమించినట్లు ఎమ్మార్పీఎస్ (మాదిగ రాజకీయ పోరాట సమితి) వ్యవస్థాపక అధ్యక్షులు బి. ఎస్ రమేష్ కుమార్ మాదిగ తెలిపారు. గురువారం హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో పుర్ర నర్సింలుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుర్ర నర్సింలు మాట్లాడుతూ ఎన్నో రోజుల నుంచి మాదిగ జాతి హక్కులు, ప్రయోజనాల కోసం ఎమ్మార్పీఎస్‌లో పని చేయడం జరుగుతుందని తన పనితనాన్ని గుర్తించి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ కుమార్ మాదిగకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలందర్ని ఏకతాటి తెచ్చి ఏబిసిడి వర్గీకరణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని పేర్కొన్నారు.

ఎంపీ అభ్యర్థిగా నీలం మధు ఎంపిక పట్ల హర్షం



నవతెలంగాణ-నంగునూరు

మెదక్ లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ బీసీ బిడ్డ నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించడం పట్ల టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. గురువారం నంగునూరులో విలేకరులతో మాట్లాడారు. సాధారణ కుటుంబంలో పుట్టి సర్పంచ్ గా ఎన్నికైన మధు పేద ప్రజలకు అనేకమైన సేవ కార్యక్రమలు చేసి ముదురాజ్‌లలో మంచి గుర్తింపు ఉందన్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయం చాలా మంచి నిర్ణయమన్నారు. ఇందిరా గాంధీ భారీ అధిక్యంతో గెలిచి ప్రధాని పీఠం అధిరోహించిన ఈ స్థానం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాల ముదిరాజ్ బిడ్డకు కేటాయించడం చాలా సంతోషకరమన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మధు విజయం కోసం సైనికుని వలె కృషి చేయాలని పిలుపునిచ్చారు. నీలం మధు ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కొత్త చరిత్ర సృష్టిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నిరుపేద వధువుకు పుస్తె మట్టెలు పంపిణీ

నవతెలంగాణ-రాయపోల్

మండలంలోని రాంసాగర్ గ్రామంలో నిరుపేద వధువు వడ్ల మానసకు బీఆర్ఎస్ నాయకులు కొండారి గణేష్, బాగున్నగారి సత్యనారాయణ గౌడ్, డాక్టర్ నాగేందర్, నరేష్ గౌడ్‌లు గురువారం పుస్తె మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంసాగర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం వడ్ల వరమ్మ తన కూతురు వివాహం చేయడానికి ఎంతో ఇబ్బంది పడుతుందని తమ దృష్టికి రాగానే పుస్తె మట్టెలు అందజేశామన్నారు.